


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326




సంపుటి : 2 | సంచిక : 446 | పేజీలు : 12 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | ఆదివారం 27 జూలై 2025 | వెల : 4/-





## నాడు స్పీకర్ చేతిలో చివాట్లు తిన్నా

- సోమనాథ్ ఛటర్జీ లోక్‌సభ స్పీకర్‌గా ఉన్న సమయంలో ఆయనను తొలిసారి కలిసినప్పుడు ధూమపానం చేసే ఎంపీల కోసం స్మోకింగ్ రూం ఏర్పాటు చేయాలని కోరా
- ఆ అలవాటు లేని వారికి ఇబ్బంది కలగదని ఆయనను అభ్యర్థించా
- కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు



## హిరాకుడ్ జలాశయానికి వరదపోటు

- ఈ జలాశయం గరిష్ట నీటి మట్టం పరిమితి 630 అడుగులు కాగా ప్రస్తుతం 609.39 అడుగులు
- జలాశయం లోనికి ప్రతి సెకన్‌కు 2.51 లక్షల క్యూసెక్కులు
- సెకనుకు 2.75 లక్షల క్యూసెక్కులు వరద నీరు విడుదల



## ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేపై భారీ ప్రమాదం

- 20 వాహనాలు ఢీ
- ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా సుమారు 16 మంది గాయాలు
- ఎక్స్‌ప్రెస్‌వే పలు గంటలపాటు వాహనాలు
- 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

# జైపాల్ రెడ్డి లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు

- కార్యకర్తలు పోయి వాలంటీర్ వ్యవస్థ వస్తోంది
- జైపాల్ రెడ్డి డెమోక్రసీ అవార్డు ప్రదానోత్సవంలో సీఎం రేవంత్ ఉద్ఘోద
- నాటి ఐడియాలజికల్ పాలిటిక్స్ పోయి ఇవాళ స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయి
- దేశ రాజకీయాల్లో సైద్ధాంతిక రాజకీయాలు పోయి, మేనేజ్మెంట్ పాలిటిక్స్ కీరోల్ ప్లే చేస్తున్నాయి
- దేశ రాజకీయాల్లో జైపాల్ రెడ్డి ఒక నిలువెత్తు శిఖరం



హైదరాబాద్

నాటి ఐడియాలజికల్ పాలిటిక్స్ పోయి ఇవాళ స్విగ్గీ పాలిటిక్స్ వచ్చాయన్నారు సీఎం రేవంత్ రెడ్డి. దేశ రాజకీయాల్లో సైద్ధాంతిక రాజకీయాలు పోయి, మేనేజ్మెంట్ పాలిటిక్స్ కీరోల్ ప్లే చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యకర్తలు పోయి వాలంటీర్ వ్యవస్థ వస్తోంద న్నారు. కార్యకర్తలు లేని రాజకీయాలు దేశ భవిష్యత్ కు ప్రమాదకర మన్న రేవంత్.. యూనివర్సిటీలలో విద్యార్థి రాజకీయలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశ రాజకీయాల్లో ధన ప్రవాహం తగ్గించాల్సిన అవసరం ఉందని, ప్రతిపక్షాలు సహేతుకమైన సూచన చేస్తే తీసుకోవడానికి మాకు - మిగతా3లో



## చేనేత రంగంలో తెలంగాణది ప్రత్యేక స్థానం

- చేనేత, జౌళిశాఖ పథకాల అమలుపై అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష
- స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించే చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలి
- డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యతతో వస్త్రాలను ఉత్పత్తి చేసేలా చర్యలు
- చేనేత రుణ మాఫీ పథకం లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేసి.. ఖాతాల్లో నిధులు జమచేయాలి

## కాంగ్రెస్ కులగణన బూటకం

- గతంలో ఎమ్మెల్సీగా గెలిపించిన పాలమూరు ప్రజలకు రుణపడి ఉంటా
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అనేది బీసీలను మోసం చేయటమే
- సీఎం రేవంత్ రెడ్డికి పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి లేదు



మహబూబ్ నగర్

కాంగ్రెస్ చేపట్టిన కులగణన బూటకమ ని విమర్శించారు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శిం చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అనేది బీసీలను మోసం చేయటమేనన్నారు. మతపరమైన రిజర్వేషన్లకు తాము వ్యతిరేకమన్నారాయన. శనివారం, మహబూబ్‌నగర్‌లో - మిగతా3లో



## సైనికులకు న్యాయ సేవ

- 'దేశానికి రక్షణ కల్పించండి..
- మీ సమస్యలతో మేం పోరాడుతాం'
- నల్సా ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ సూర్యకాంత్
- 'నల్సా వీర్ పరివార్ సహాయతా యోజన 2025' ప్రారంభం

## కాంగ్రెస్ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలి



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- కేసీఆర్ హయాంలో సంక్షేమంలో స్వర్ణయుగంలా మారింది
- 73 వేల కోట్లు రైతుబంధు రూపంలో అన్నదాతలకు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే
- బీఆర్ఎస్ పాలనలో మోదీ సర్కార్ మనల్ని ఎంతో ఇబ్బంది పెట్టింది
- ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం
- మేడిగడ్డ బరాజ్‌పై కూడా కాంగ్రెస్ వాళ్లు కుట్రలు చేశారు

హైదరాబాద్

కేసీఆర్ హయాంలో సంక్షేమంలో స్వర్ణయుగంలా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 73 వేల కోట్లు రైతుబంధు రూపంలో అన్నదాతలకు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. హైదరాబాద్ ఉప్పల్ సమీపంలోని మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో శనివారం నాడు నిర్వహించిన బీఆర్ఎస్వీ రాష్ట్ర స్థాయి సదస్సుకు కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా - మిగతా3లో



## రెండురోజులు భారీ వర్షాలు

- హెచ్చరించిన వాతావరణశాఖ..!
- బంగాళాఖాతంలోని డాల్టన్‌గంజ్ (జార?ండ్)కు 80 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం
- ఉత్తర ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్ మీదుగా పశ్చిమ దిశగా కదులుతూ ఈ నెల 27 నాటికి అల్పపీడన ప్రాంతంగా మారే అవకాశాలు
- రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలు

# కార్ రిపేర్ సాధ్యమేనా?

## స్టూడెంట్స్ వింగ్ వర్సెస్ జాగృతి

- పోటాపోటీగా ఒకే రోజూ శిక్షణా తరగతులు, వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించడం పార్టీలో తీవ్ర గందరగోళంగా తయారైందంట
- బీఆర్ఎస్‌లో ఆధిపత్యపోరు జాగృతి వర్సెస్ బీఆర్ఎస్వీగా మారిందా అనే చర్చ స్టార్ట్ అయిందట.
- రెండు విభాగాలు వేర్వేరు అంశాలపై పోటాపోటీ శిక్షణా తరగతులకు సిద్ధమవ్వడం పార్టీ శ్రేణులను కన్ఫ్యూచన్‌లోని నెడుతోందంట

హైదరాబాద్

కారు పార్టీని తిరిగి రేసులోకి తీసుకురావాల్సిన పార్టీ ముఖ్యనేతలు, అందులోనూ కల్వకుంట్ల వారసులు వ్యవహరిస్తున్న తీరు బీఆర్ఎస్ వర్గాకు అసలు మింగుడుపడటం లేదంట? తాజాగా కవిత జాగృతి వర్సెస్ పార్టీ అనుభంద సంస్థ బీఆర్ఎస్వీ. పోటాపోటీగా ఒకే రోజూ శిక్షణా తరగతులు, వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించడం పార్టీలో తీవ్ర గందరగోళంగా తయారైందంట. జాగృతి వర్సెస్ బీఆర్ఎస్ గా మారిన ఆధిపత్యపోరు. బీఆర్ఎస్‌లో ఆధిపత్యపోరు జాగృతి వర్సెస్ బీఆర్ఎస్వీగా మారిందా అనే చర్చ స్టార్ట్ అయిందట. రెండు విభాగాలు వేర్వేరు అంశాలపై పోటాపోటీ శిక్షణా తరగతులకు సిద్ధమవ్వడం పార్టీ శ్రేణులను కన్ఫ్యూచన్‌లోని నెడుతోందంట. . - మిగతా3లో



# సైనికులకు న్యాయసేవ

భారతదేశ చరిత్రలోనే తొలిసారిగా సైనికుల కుటుంబాలకు న్యాయసహాయం అందించనున్నారు. 'నల్సా వీర్ పరివార్ సహాయతా యోజన 2025' పేరుతో ఈ కొత్త కార్యక్రమం ద్వారా భారతీయ సైనికులకు సాయం చేయనున్నారు. సొంత ఊళ్లకు దూరంగా దేశం కోసం సేవలందిస్తున్న సైనికులు, తమ కుటుంబ సభ్యులు కొన్నిసార్లు స్థానికంగా న్యాయపరమైన వివాదాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. దాంతో దేశం కోసం సుదూర ప్రాంతాల్లో పోరాడుతున్న సైనికులు స్వగ్రామాలకు రావడం కష్టంగా మారుతుంది. అలాంటివారికి, తమ కుటుంబ సభ్యులకు న్యాయసేవ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ శ్రీనగర్‌లో జరిగిన కార్గిల్ విజయ్ దివాస్ సదస్సులో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు. ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్ తర్వాత ఈమేరకు నిర్ణయం తీసుకోవడం సైనికులకు ఎంతో వెసులుబాటు కల్పిస్తుందని నమ్ముతున్నారు. ఈ ఆపరేషన్ సమయంలో సాయుధ దళాలు చేసిన త్యాగాలను చూసి తీవ్రంగా చలించిపోయానని జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. న్యాయవ్యవస్థ వారి శ్రేయస్సుకు మరింత ప్రత్యక్షంగా దోహదపడే మార్గాలను అన్వేషిస్తుందన్నారు. అందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు.



**ఈ కార్యక్రమం ఉద్దేశం..**

సైనికులు విధుల్లో ఉన్నప్పుడు అపరిష్కృత ఆస్తి వివాదాలు, కుటుంబ కలహాలు, భూ సమస్యలు, ఇతర చట్టపరమైన విషయాల నుంచి ఉపశమనం కలిగించేలా న్యాయసేవ అందిస్తారు.

సైనికులు వృత్తిపరమైన కారణాలతో కోర్టుకు హాజరు కాలేకపోయినా, కోర్టులో కుటుంబాలకు ప్రాతినిధ్యం వహించడానికి నల్సా రంగంలోకి దిగుతుంది.

ఇండియన్ ఆర్మీ, బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్, ఐటీబీపీ, ఇతర పారామిలటరీ బలగాలు దీని పరిధిలోకి వస్తారు.

ప్యానెల్ లాయర్లు, పారాలీగల్ వాలంటీర్లకు సులభంగా అందుబాటులో ఉండేలా రాష్ట్రాల్లోని సైనిక్ వెల్ఫేర్ బోర్డులను ఏర్పాటు చేస్తారు.

కేసు పురోగతిని పర్యవేక్షించడానికి, సకాలంలో పరిష్కారాన్ని నిర్ధారించడానికి వీరు తోడ్పాటు అందిస్తారు.

# సరికొత్త మైలురాయిని చేరనున్న ఇస్రో..

# 30న నాసాతో కలిసి తొలిసారిగా నిసార్ మిషన్!

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో త్వరలో సరికొత్త మైలురాయిని చేరుకోనున్నది. నాసాకు చెందిన నిసార్ ఉపగ్రహాన్ని ఇస్రో నింగిలోకి పంపనున్నది. ఈ నెల 30న ఈ ఉపగ్రహాన్ని ఇస్రో ప్రయోగించనున్నది. ఈ విషయాన్ని ఇస్రో చైర్మన్ వీ నారాయణన్ సైతం ధ్రువీకించారు. ఈ నెల 30న నిసార్ మిషన్‌ను ప్రయోగించనున్నట్లు తెలిపారు. జులై 30న సాయంత్రం 5.40 గంటలకు ఏపీలోని శ్రీహరికోట సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి నిసార్ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్లు నాసా తెలిపింది. ఈ మిషన్ బడ్జెట్ దాదాపు రూ.12,500 కోట్లు. భారత్‌కు చెందిన ఇస్రో, అమెరికాకు చెందిన నాసా సంస్థలు సంయుక్తంగా మిషన్‌ను చేపడుతున్నది. ప్రయోగం నేపథ్యంలో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**కీలకం కానున్న ఉపగ్రహం..**

అత్యాధునిక టెక్నాలజీతో ఈ శాటిలైట్‌ను రూపొందించారు. దాంతో ప్రయోజనాలు సైతం అదేస్థాయిలో ఉంటాయని ఇస్రో వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రకృతి విపత్తుల నిర్వహణ, భూ వాతావరణంలో మార్పులపై అధ్యయనం, సముద్రాలపై అధ్యయనం చేయడంతో పాటు రక్షణ వ్యవహారాల్లోనూ ఈ ఉపగ్రహం కీలకం కాబోతున్నది. రెండుదేశాలు సంయుక్తంగా కలిసి రూపొందించిన శాటిలైట్‌కు నిసార్‌గా నామకరణం చేశారు. నాసా, ఇస్రో పేర్లు వచ్చేలా ఈ పేరు పెట్టారు. ఈ శాటిలైట్‌ను ఇస్రోకు చెందిన జీఎస్ఎల్వీ రాకెట్ (%+ూాం-ఖీ%18) మోసుకువెళ్లనున్నది. ఉపగ్రహాన్ని భూమికి 743 కిలోమీటర్ల ఎత్తులో 98.40 డిగ్రీల కోణంలో కక్ష్యలో ప్రవేశపెడుతారు. తొలిసారిగా ఈ శాటిలైట్‌ను సార్ అనే టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఇందులో రెండురకాల రాడాలు ఉంటాయి. నాసా ఎల్ బ్యాండ్, ఇస్రో ఎస్-బ్యాండ్ రాడార్లు ఉంటాయి. ఇవి దట్టమైన అడవుల్లో సైతం సమాచారాన్ని సేకరిస్తాయి. భూమి పొరల్లో కదలికలతో పాటు భూమిపై తేమశాతాన్ని కచ్చితత్వంతో అంచనా వేస్తుంది. అలాగే, ఉపరితల నీటి వనరుల మ్యాపింగ్, విపత్తు నిర్వహణతో పాటు అనేక కీలకమైన రంగాల్లో సేవలు అందిస్తుందని ఇస్రో తెలిపింది. భూకంపాలు, మంచు




పలకలల్లో మార్పులతో భూమిలో స్వల్ప పగుళ్లను ఈ ఉపగ్రహం గుర్తిస్తుంది.

**త్వరలో బ్లూబర్డ్-2 మిషన్..**

ఎస్ బ్యాండ్ పేలోడ్‌ను ఇస్రో అహ్మదాబాద్‌లోని ల్యాబ్‌లో అభివృద్ధి చేసింది. ఎల్ బ్యాండ్ పేలోడ్‌ను నాసాకు చెందిన జేపీఎల్ అభివృద్ధి చేసింది. రెండింటిని విలీనం చేస్తూ నిసార్ ఉపగ్రహంలో ఉపయోగిస్తున్నారు. ఈ సాంకేతికత, రాడార్ వ్యవస్థ సహాయంతో ఖచ్చితత్వంతో ఫొటోలు తీయొచ్చు. భూమి ఉపరితం హై రిజల్యూషన్ చిత్రాలు ప్రతిరోజు 12 తీస్తుంది. రెండురాడార్లు మెష్ రిఫ్లెక్టర్ యాంటెన్నా ద్వారా డేటాను సేకరిస్తాయి. ఉపగ్రహం 242 కిలోమీటర్ల వెడల్పు, అధిక స్పేషియల్ రిజల్యూషన్‌తో భూమిని పరిశీలిస్తుంది. ఈ రెండూ భూమిపై పెరుగుతున్న, తగ్గుతున్న చెట్లు, మొక్కల సంఖ్యను గమనిస్తాయని ఇస్రో తెలిపింది. ఇస్రో చైర్మన్ నారాయణన్ మాట్లాడుతూ త్వరలోనే ముమ్మందు పెద్ద మిషన్లు చేపట్టనున్నట్లు తెలిపారు. బ్లూబర్డ్ 2 మిషన్ అనే వాణిజ్య ప్రయోగం చేపట్టబోతున్నట్లు తెలిపారు. తొలిసారిగా పీఎల్ఎల్వీ ఎల్-1ని ప్రయోగించబోతున్నట్లు చెప్పారు. దీన్ని ప్రైవేటు పరిశ్రమలు అభివృద్ధి చేస్తున్నాయన్నారు. మోదీ మార్గదర్శకత్వంలో గగన్‌యాన్ మిషన్‌పై పని చేస్తున్నామని.. ఈ ఏడాది జీ-1 రాకెట్‌ను ప్రయోగిఇంచనున్నట్లు తెలిపారు. చంద్రుడిపై మానవయాత్ర గురించి స్పందిస్తూ ప్రధానమంత్రి ఈ ప్రాజెక్టును అధ్యయనం చేయాలని కోరారన్నారు. 2040 నాటికి చంద్రుడిపైకి ఆస్ట్రోనాట్స్‌ను దింపి.. తిరిగి సురక్షితంగా తీసుకురావాలని చెప్పారన్నారు. ఈ విషయంలో పని చేస్తున్నామన్నారు.

# ఇక చాలు.. గాజాలో పని ముగించండి

గాజాలో చేపట్టిన మిలిటరీ ఆపరేషన్‌ను ఉధృతం చేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇజ్రాయెల్‌ను కోరారు. అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ ప్రతిపాదనను హమాస్ సంస్థ తిరస్కరించింది. ఈ పరిణామంతో రగిలిపోయిన ట్రంప్.. ఆ సంస్థ కథ ముగించాల్సిందేనని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. స్కాట్లాండ్ పర్యటనకు వెళ్లే ముందు ట్రంప్ మాట్లాడుతూ.. "మా ప్రతిపాదనే తిరస్కరిస్తారా?. వాళ్లకు(హమాస్) ఒప్పందం చేసుకోవాలనే ఆలోచన నిజంగా లేనట్లు ఉంది. వాళ్లు చావాలనుకుంటున్నారేమో. గాజాలో దాడులను ఉధృతం చేయండి. ప్రక్షాళన చేయండి?" అంటూ ఇజ్రాయెల్‌ను ఉద్దేశించి పిలుపు ఇచ్చారాయన. హమాస్ ఒప్పందానికి సిద్ధంగా లేదు. ఎందుకంటే వారు శాంతికి కాకుండా హింసకు కట్టుబడి ఉన్నారు. ఇప్పుడు చివరి బంధీల వద్దకు వచ్చాం. వాళ్లు ఒప్పందం చేయాలనుకోవడం లేదు. వాళ్లను వేటాడాల్సిందే అని ట్రంప్ అన్నారు. ట్రంప్ తరఫున పశ్చిమాసియా దౌత్యవేత్త స్టీవ్ విట్కాఫ్.. ఇజ్రాయెల్- హమాస్ చర్చల నుంచి వెనక్కి తగ్గుతున్నట్లు ప్రకటించారు. ఆ మరుసటిరోజే ట్రంప్ విరుచుకుపడడం గమనార్హం. విట్కాఫ్ ప్రకారం.. ప్రస్తుతానికి ఈ చర్చల నుంచి అమెరికా వెనక్కి తగ్గుతోంది. శాంతి ఒప్పందం పట్ల హమాస్ అంతగా ఆసక్తి చూపించడం లేదు. కొత్త ?వ్యూహం కోసం దోహా నుంచి తిరిగి వాషింగ్టన్ వెళ్తునట్లు తెలిపారాయన. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు మాట్లాడుతూ.. హమాస్ పాలనను ముగించేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నామని తెలిపారు. అయితే.. హమాస్ నేత బాసెమ్ నైమ్ మాత్రం, చర్చలు నిర్మాణాత్మకంగా జరిగాయి అని పేర్కొన్నారు. విట్కాఫ్




వ్యాఖ్యలు కేవలం ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఒత్తిడి కలిగించేందుకు చేసినవని విమర్శించారు. మరోవైపు.. మధ్యవర్తులు ఖతార్, ఈజిప్ట్ కూడా చర్చలు సానుకూలంగానే సాగుతున్నట్లు చెబుతున్నాయి. చర్చల్లో కొంత పురోగతి సాధించామని, చర్చలు నిలిపివేయడం సాధారణ ప్రక్రియ అని, అమెరికాతో కలిసి కాల్పుల విరమణ కోసం కోసం ప్రయత్నం కొనసాగిస్తామని చెప్పారు. ఇక.. గాజాలో మానవతా సంక్షోభం తీవ్ర స్థాయికి చేరుకుంది. ఆహార కొరత, బాలలలో పోషకాహార లోపం, వందల మంది ఆకలితో మరణించడంలాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి. వంటి సంస్థలు తక్షణ సహాయం అవసరం అని హెచ్చరిస్తున్నాయి. ఇజ్రాయెల్ మాత్రం ఆహారం సరిపడా పంపించామని, ఐరాసనే సరైన పంపిణీ చేయడం లేదని ఆరోపిస్తోంది.

## నాడు స్పీకర్ చేతిలో చివాట్లు తిన్నా




**ఢిల్లీ:** తాను రాజకీయాల్లోకి వచ్చిన తొలినాళ్ల నాటి అనుభవాలను, ఓ సంఘటనను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గుర్తు చేసుకున్నారు. ఢిల్లీలో శనివారం నిర్వహించిన సంసద్ రత్న అవార్డుల కార్యక్రమంలో మాట్లాడుతూ.. గతంలో లోక్‌సభ స్పీకర్ సోమనాథ్ ఛటర్జీ తో తొలిసారి భేటీ అయినప్పుడు ఆయనను స్మోకింగ్ రూం ఏర్పాటు చేయాలని కోరానని, దానికి ఆయన చివాట్లు పెట్టినట్లు వెల్లడించారు. సోమనాథ్ ఛటర్జీ లోక్‌సభ స్పీకర్‌గా ఉన్న సమయంలో ఆయనను తొలిసారి కలిసినప్పుడు ధూమపానం చేసే ఎంపీల కోసం స్మోకింగ్ రూం ఏర్పాటు చేయాలని కోరానని..దానివల్ల ఆ అలవాటు లేని వారికి ఇబ్బంది కలగదని ఆయనను అభ్యర్థించానని రిజిజు తెలిపారు. దీంతో ఆగ్రహించిన సోమనాథ్ స్పీకర్‌తో జరుగుతున్న మొదటి సమావేశంలో ఇటువంటి విషయాలు చర్చించడానికి వచ్చారా అని తనను తీవ్రంగా మందలించారన్నారు. నాటి నుంచి అత్యున్నత పదవుల్లో ఉన్న వారి దృష్టికి ఎటువంటి సమస్యలు తీసుకువెళ్లాలి, వారితో ఎలా మాట్లాడాలనే విషయాలను తెలుసుకున్నానని కేంద్రమంత్రి చెప్పుకొచ్చారు.

అదే విధంగా ప్రస్తుతం ప్రజలు ఎంపీల వద్దకు వచ్చి వారి వ్యక్తిగత ఫిర్యాదులు, మౌలిక సదుపాయాల కల్పన, చట్టపరమైన సమస్యలు వంటి విషయాలను పరిష్కరించాలని అడుగుతుంటారని అన్నారు. ఎంపీలను కలిసేటప్పుడు ప్రజలు ముఖ్యమైన సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అలాగే రాజకీయ జీవితంలో ఉన్న వారికి ప్రత్యర్థి పార్టీల నాయకులు శత్రువులు కాదని అన్నారు. ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలందరినీ తాను సహోద్యోగులుగానే భావిస్తానని చెప్పారు.

## హిరాకుడ్ జలాశయానికి వరదపోటు

**ఒడిశా, భువనేశ్వర్:** హిరాకుడ్ జలాశయంలో వరద నీటి ఉధృతి పెరుగుతుంది. ఈ జలాశయం గరిష్ట నీటి మట్టం పరిమితి 630 అడుగులు కాగా ప్రస్తుతం 609.39 అడుగుల నీటి మట్టం కొనసాగుతుంది. నీటి మట్టం నియంత్రణలో భాగంగా అంచెలంచెలుగా వరద నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం ఎడమ వైపు 13, కుడి వైపు ఏడు.. మొత్తం మీద 20 గేట్లు తెరిచి వరద నీటిని విడుదల చేస్తున్నారు.

జలాశయం లోనికి ప్రతి సెకన్‌కు 2.51 లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తుండగా సెకనుకు 2.75 లక్షల క్యూసెక్కులు వరద నీరు విడుదల చేస్తున్నారు. వరద ఉధృతి దృష్ట్యా మిగిలిన గేట్లు తెరిచే విషయం ఖరారు చేస్తారని జల వనరుల శాఖ చీఫ్ ఇంజినీర్ తెలిపారు. గురువారం నుంచి పలు చోట్ల ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. 15 జిల్లాల 43 మండలాల్లో 50 మిల్లీమీటర్లు పైబడి వర్షపాతం నమోదు అయినట్లు విభాగం సమాచారం. ఇదే పరిస్థితి కొనసాగితే నదుల్లో నీటి మట్టం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం అన్ని నదుల నీటి మట్టం ప్రమాద సంకేతం దిగువన కొనసాగుతుందని సమాచారం.

## ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేపై భారీ ప్రమాదం



**ముంబై:** వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేపై పెద్ద ప్రమాదం జరిగింది. 20 వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఒకరు మరణించారు. సుమారు 16 మంది గాయపడ్డారు. మహారాష్ట్రలోని పుణే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. శనివారం సాయంత్రం ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేలోని సొరంగం ప్రవేశద్వారం వద్ద పెద్ద ప్రమాదం సంభవించింది. హైవేలోని లోనావాలా-ఖండాల ఘాట్ వద్ద కంటైనర్ వాహనం బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. నియంత్రణ కోల్పోయిన ఆ కంటైనర్ ముందున్న ఒక వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో ముందున్న పలు వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. పలు కార్లతో సహా సుమారు 20 వాహనాలు దెబ్బతిన్నాయి. కాగా, ఈ భారీ ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించగా సుమారు 16 మంది గాయపడ్డారు. వారిని వెంటనే అంబులెన్స్‌లలో ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటన నేపథ్యంలో ఆ ఎక్స్‌ప్రెస్‌వే పలు గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి. 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరోవైపు పోలీసులు, ఎమర్జెన్సీ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ధ్వంసమైన వాహనాలను రోడ్డు పక్కకు తొలగించారు. ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేసేందుకు ట్రాఫిక్ పోలీసులు చాలా శ్రమించారు. వాహనాల రద్దీ తగ్గించడానికి ఇతర మార్గాల ద్వారా ట్రాఫిక్‌ను మళ్లించారు. కాగా, ముంబై-పుణే ఎక్స్‌ప్రెస్‌వేపై జరిగిన భారీ ప్రమాదానికి సంబంధించిన వీడియో క్లిప్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

## అత్యంత విశ్వసనీయ నేతగా మోదీ..

## మార్నింగ్ కన్సల్ట్‌లో అత్యధిక రేటింగ్



**ఇంటర్నెట్‌డెస్క్:** ప్రపంచంలో అత్యంత విశ్వసనీయ నేతగా ప్రధాని నరేంద్ర మోదీ నిలిచారు. మార్నింగ్ కన్సల్ట్ సంస్థ నిర్వహించిన గ్లోబల్ లీడర్ సర్వేలో ఇది వెల్లడైంది. ఈవిషయాన్ని తెలుపుతూ భాజపా నేత అమిత్ మాలవీయ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. భారతీయులతో పాటు ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది విశ్వసించే నాయకుడిగా ప్రధాని మోదీ అగ్రస్థానంలో నిలిచారని మాలవీయ పేర్కొన్నారు. భారత్ సురక్షితమైన చేతుల్లోనే ఉందన్నారు. ఈ ఏడాది జులై 4-10 మధ్య మార్నింగ్ కన్సల్ట్ ఈ సర్వే నిర్వహించింది. అందులో ప్రపంచంలో అత్యంత విశ్వసనీయత కలిగిన నాయకుడిగా 75శాతం మద్దతుతో మోదీ మొదటిస్థానంలో నిలిచారు. 57శాతంతో దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే-మ్యుంగ్ రెండో స్థానంలో ఉన్నారు. అర్జెంటీనా అధ్యక్షుడు జేవియర్ మిలి, కెనడా ప్రధాని మార్క్‌కార్నీ తదితరులు ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇక, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 44శాతంతో ఎనిమిదో స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ కలిగిన నేతగా మోదీ పలుమార్లు తొలిస్థానంలో నిలిచారు. 2021 సెప్టెంబరులో మార్నింగ్ కన్సల్ట్ నిర్వహించిన సర్వేలో ప్రధానికి 70శాతం మద్దతు లభించింది. 2022 ప్రారంభంలో 71 శాతంతో అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్నారు. ఆ తర్వాత ఏప్రిల్, సెప్టెంబర్, డిసెంబర్‌లలో నిర్వహించిన సర్వేల్లో 76శాతం మద్దతు దొరికింది. 2024 ఫిబ్రవరిలో 78శాతంతో మరోసారి అగ్రస్థానానికి చేరుకొన్నారు.

# జైపాల్ రెడ్డి లేకుంటే తెలంగాణ వచ్చేది కాదు

-మొదటిపేజీ తరువాయి

ఇబ్బంది లేదని రేవంత్ స్పష్టం చేశారు. అందుకే తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు శాసనసభ నుంచి ఎవరినీ సస్పెండ్ చేయలేదని కూడా రేవంత్ రెడ్డి చెప్పారు. జైపాల్‌రెడ్డి నమ్మిన సిద్ధాంతాన్ని ముందుకు తీసుకెళ్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఆయన పాత్ర ఎన్నటికీ మరువలేనిదన్నారు. జైపాల్ రెడ్డి లేకుంటే తెలంగాణ సాకారమయ్యేది కాదని చెప్పారు. 'జైపాల్‌రెడ్డి మెమోరియల్ అవార్డు' ప్రదానోత్సవానికి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జైపాల్‌రెడ్డికి ప్రతిపక్ష పార్టీలతో సిద్ధాంతపరంగా మాత్రమే విభేదాలు ఉండేవని, రాజకీయాల్లో 40 ఏళ్లపాటు ఆయన అజాతశత్రువుగా ఉన్నారని చెప్పారు.

" సమాచారహక్కు చట్టం రావడంలో జైపాల్‌రెడ్డి కృషి ఎంతో ఉంది. సంస్కరణల అమలుకు కూడా ఆయన ఎంతో తాపత్రయపడేవారు. కల్వకుర్తి ప్రాంతంలో మార్పుల కోసం ఎంతో కృషి చేశారు. తెలంగాణ నుంచి పీవీ నరసింహారావు తర్వాత అంతపేరు తెచ్చుకున్నది జైపాల్ రెడ్డి మాత్రమే. దేశ రాజకీయాల్లో జైపాల్ రెడ్డి ఒక నిలువెత్తు శిఖరం అని కొనియాడిన రేవంత్ రెడ్డి.. పీవీ, జైపాల్ రెడ్డి లాంటి వారి స్ఫూర్తి తెలంగాణ రాజకీయాల్లో ఉండాలని ఆకాంక్షించారు. 'జైపాల్ రెడ్డి డెమోక్రసీ అవార్డు' ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక అంశాలపై కూలంకషంగా మాట్లాడారు. విద్యార్థి నాయకుడిగా, శాసన సభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్రమంత్రిగా వివిధ హోదాల్లో జైపాల్ రెడ్డి గారు పని చేసి, దేశానికే తలమానికమైన పనులు చేశారని చెప్పారు.

అలా అని సోనియాగాంధీ నాతో చెప్పారు

స్వర్గీయ జైపాల్ రెడ్డి గొప్పతనం గురించి చెబుతూ సీఎం




రేవంత్ ఇంకా ఏమన్నారంటే.. '1969 లో తొలిసారి కల్వకుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నాలుగుసార్లు శాసనసభ్యుడిగా, 5 సార్లు లోక్ సభ సభ్యుడిగా, 2 సార్లు రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా పనిచేశారు. పెట్రోలియం శాఖ నిర్వహిస్తున్న సమయంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారు. సమాచార శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ప్రసార భారతి చట్టాన్ని దేశానికి అందించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పాత్ర ఉండాలని ఆయన విశ్వసించి ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. పార్లమెంట్ లో రాణించిన వారి నుంచి మేధావుల వరకు ఎవరితోనూ జైపాల్ రెడ్డి గారితో వ్యక్తిగత వైరం లేదు. ఉత్తమ పార్లమెంటేరియన్ గా దేశ రాజకీయాల్లో బలమైన ముద్ర వేసిన వ్యక్తి జైపాల్ రెడ్డి గారు. చివరి శ్వాస వరకు ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారు. పరిపాలనలో తీసుకురావాల్సిన మార్పులపై జైపాల్ రెడ్డి ఎక్కువ ఆలోచించేవారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కల్వకుర్తి ప్రాంతంలో విద్యుత్ అవసరమని గుర్తించి అభివృద్ధికి బాటలు వేశారు. రాజకీయాలలో ధన ప్రవాహం తగ్గించాలని ఆయన ప్రయత్నించారు. తెలంగాణ ఏర్పాటులో ఆయన పాత్ర లేకపోతే ఇవాళ తెలంగాణ వచ్చేది కాదు. చర్చ లేకుండానే పార్లమెంట్ లో తెలంగాణ బిల్ ఆమోదించేలా జైపాల్ రెడ్డి ప్రత్యేక పాత్ర పోషించారు. జైపాల్ రెడ్డి గారి చొరవతోనే తెలంగాణ ఏర్పాటు చేశామని సోనియా గాంధీ ఒక సందర్భంలో నాతో చెప్పారు. కాంగ్రెస్ ను వీడినా, తిరిగి కాంగ్రెస్ లో చేరినా సైద్ధాంతిక విభేదాలే తప్ప.. పదవుల కోసం ఆయన పార్టీలు మారలేదు. ' అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# కాంగ్రెస్ కుట్రలను ప్రజలు అర్ధం చేసుకోవాలి

-మొదటిపేజీ తరువాయి

ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ కోసం ప్రతి యూనివర్సిటీలో విద్యార్థులు పోరాటం చేశారని అన్నారు. తెలంగాణ విద్యార్థుల పోరాట ప్రతిమను దేశం గుర్తించిందని తెలిపారు. తెలంగాణ కోసం ఎంతోమంది అమరులయ్యారని గుర్తుచేశారు. తెలంగాణ కోసం కేసీఆర్ సారథ్యంలో సబ్బండ వర్గాలు కదం తొక్కాయని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ వచ్చాక కేసీఆర్ అద్భుతంగా పరిపాలించారని తెలిపారు.

బీఆర్ఎస్ పాలనలో మోదీ సర్కార్ మనల్ని ఎంతో ఇబ్బంది పెట్టిందని కేటీఆర్ అన్నారు. ఎవరి కోసం ఎదురుచూడకుండా అన్ని రంగాల్లో తెలంగాణను అగ్రగామిగా నిలిపామని తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణకు తిరుగులేకుండా పోయిందని చెప్పారు. అప్పుడు తెలంగాణకు కేంద్రంలోని మోదీ సర్కార్ సహకరించలేదని తెలిపారు. ఎవరో వస్తారని ఏదో చేస్తారని కేసీఆర్ ఎదురుచూడలేదని అన్నారు. తెలంగాణ ఏర్పడినప్పుడు 12వ స్థానంలో ఉన్న తెలంగాణను వ్యవసాయంలో అగ్రగామిగా నిలబెట్టామని తెలిపారు. తలసరి ఆదాయంలో తెలంగాణను మొదటి స్థానంలో నిలిపామని చెప్పారు. రాష్ట్రంలో జిల్లాకో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం

ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం ప్రాజెక్టు అని కేటీఆర్ తెలిపారు. ప్రపంచంలో హిమాలయాలంత ఎత్తుకు తెలంగాణను కేసీఆర్ తీసుకెళ్లారని పేర్కొన్నారు. నాలుగేళ్లలో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తి చేశారని చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద మల్టీపర్పస్ ప్రాజెక్టు కాళేశ్వరం అని అన్నారు. కాళేశ్వరం ద్వారా లక్షల ఎకరాలకు సాగునీరు, వేల గ్రామాలకు తాగునీరు అందించామని చెప్పారు. కాళేశ్వరం నుంచి రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసేలా ఏర్పాటు చేశామని వివరించారు. చివరి ఆయకట్టు వరకు నీళ్లిచ్చిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ పాలనలో ఒక్కో ప్రాజెక్టు 40 ఏళ్లు కట్టారని తెలిపారు. కానీ ఈ ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి జరిగిందని కాంగ్రెస్, బీజేపీలు తప్పుడు ప్రచారం చేశాయని మండిపడ్డారు. 80వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల కుంభకోణం ఎలా జరుగుతుందని.. అసెంబ్లీలో నిలదీయడంతో కాంగ్రెస్, బీజేపీ మాట మార్చాయని తెలిపారు.

### ఎవర్ని ఉరితీయాలి

మేడిగడ్డ బరాజ్‌పై కూడా కాంగ్రెస్ వాళ్లు కుట్రలు చేశారని కేటీఆర్ మండిపడ్డారు. దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ అంటే.. దుడ్డెను కట్టేయమన్నట్లు బీజేపీ వ్యవహరిస్తుందని విమర్శించారు. ఎక్స్‌పాన్షన్ జాయింట్ల దగ్గర వెడల్పయితే కూలిందని ప్రచారం చేశారని మండిపడ్డారు. మేడిగడ్డ బరాజ్‌లోని 85 పిల్లర్లలో రెండు కొంచెం కుంగితే కూలిందని ప్రచారం చేశారని విమర్శించారు. శతాబ్దాలుగా ఎప్పుడు రానంత వరద వచ్చినా మేడిగడ్డకు ఏం కాలేదని గుర్తుచేశారు.

కానీ కాళేశ్వరం కూలేశ్వరం అయ్యిందని సీఎం రేవంత్ రెడ్డి రోజూ మాట్లాడతారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం కట్టినోళ్లను ఉరితీయాలని అంటున్నారని మండిపడ్డారు. మీలెక్క 40 ఏళ్ల కట్టనందుకు ఉరితీయాలా అని ప్రశ్నించారు. మీలెక్క రైతులకు నీళ్లు ఇవ్వనందుకు ఉరితీయాలా అని నిలదీశారు. ఫ్లోరోసిస్ వ్యాధితో నల్గొండలో పిల్లలు పుట్టకుండా చంపేసినందుకు కాంగ్రెస్ వాళ్లను ఏం చేయాలని కేటీఆర్ ప్రశ్నించారు. దశాబ్దాలుగా ప్రాజెక్టులను పడావు పెట్టినందుకు కాంగ్రెస్ నేతల్ని ఉరితీయాలని అన్నారు.

కాంగ్రెస్ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలి

రేవంత్ రెడ్డి నోటికొచ్చినట్లు హామీలు ఇచ్చి ప్రజలను ఏమార్చారని మండిపడ్డారు. అన్నీ తెలిసే అధికారం కోసం కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు తీసేస్తే రెండు లక్షల ఉద్యోగాలు వస్తాయని రేవంత్ రెడ్డి అన్నాడని గుర్తుచేశారు. 25 లక్షల కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామని నమ్మబలికారని అన్నారు. చివరకు అన్ని హామీలు ఎగ్గొట్టి మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు.

### ఒక్కొక్కరూ ఒక్కో కేసీఆర్‌లా విజృంభించాలి.. కేటీఆర్ పిలుపు

రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే కొందరి గొంతులు లేస్తున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వాళ్లను అడ్డుకోవడానికి మనకు ఉన్న అస్త్రం సోషల్ మీడియా అని తెలిపారు. ఒక్కొక్కరూ ఒక్కో కేసీఆర్‌లా విజృంభించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ ఉప్పల్ సమీపంలోని మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో శనివారం నాడు నిర్వహించిన బీఆర్ఎస్వీ రాష్ట్ర స్థాయి సదస్సుకు కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మీడియా పేరుతో కొన్ని స్లాటర్ హౌస్‌లు పనిచేస్తున్నాయని మండిప డ్డారు. మీ ముందున్న అన్యాయాన్ని సోషల్ మీడియాలో పెట్టాలని సూచించారు. తెలంగాణలో కాంట్రాక్టులన్నీ చంద్రబాబు కోవర్టులే చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే స్వయంగా చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్, చంద్రబాబు, మోదీ కలిసి బీఆర్ఎస్‌పై కుట్రలు పన్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ ఉంటే వాళ్ల ఆటలు సాగవని కుట్రలు చేస్తున్నారని అన్నారు. గోదావరి నికర జలాల్లో తెలంగాణ వాటా 968 టీఎంసీలు రావాలని చెప్పారు. గోదావరి వరద జలాల్లో మన వాటా మనకు రావాలని అన్నారు. బనకచర్లకు వ్యతిరేకంగా బీఆర్ఎస్వీ చేస్తున్న పోరాటం అభినందనీయమని ప్రశంసించారు. మోదీ జుట్టు తన చేతిలో ఉందని చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రేవంత్ రెడ్డి తాను చెప్పినట్లు ఆడతాడని చంద్రబాబు నమ్మకమని అన్నారు. ప్రభుత్వాలు ఫోన్ ట్యాపింగ్ చేస్తాయని రేవంత్ రెడ్డి చెప్పాడని కేటీఆర్ గుర్తుచేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం కాంగ్రెస్‌కు డైవర్షన్‌కు పనికొస్తుందని తెలిపారు. 20 నెలలైనా గ్యారంటీలు, హామీలపై కాంగ్రెస్ నోరెత్తడం లేదని అన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు తీసేస్తే రెండు లక్షల ఉద్యోగాలు వస్తాయని రేవంత్ రెడ్డి నమ్మించి మోసం చేశారని తెలిపారు. 25 లక్షల కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామని నమ్మబలికారని అన్నారు. చివరకు అన్ని హామీలు ఎగ్గొట్టి మోసం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. ఒక్కో ఆడబిడ్డకు రేవంత్ రెడ్డి 50 వేలు బాకీ ఉన్నాడని చెప్పారు. 7 లక్షల ఆడబిడ్డలకు తులం బంగారం బాకీ పడ్డారని అన్నారు. రేవంత్ రెడ్డి నోటికొచ్చినట్లు హామీలు ఇచ్చి ప్రజలను ఏమార్చారని మండిపడ్డారు. అన్నీ తెలిసే అధికారం కోసం కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందని మండిపడ్డారు.

### మిత్తితో సహా జవాబు చెబుతాం.. పోలీసులకు కేటీఆర్ వార్నింగ్

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై పోలీసుల తీరుపై వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్ ఉప్పల్ సమీపంలోని మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో శనివారం నాడు నిర్వహించిన బీఆర్ఎస్వీ రాష్ట్ర స్థాయి సదస్సుకు కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని పోలీసులను ఉద్దేశించి అన్నారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక మిత్తితో సహా జవాబు చెబతామని హెచ్చరించారు.

బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అరెస్టయి పోలీస్ స్టేషన్‌లో ఉంటే ఆయనింటికి పోలీసులు వెళ్లారని కేటీఆర్ తెలిపారు. గెల్లు భార్య ఫోన్ ఇవ్వనని చెప్పినందుకు ఆమెపై అటెంప్ట్ మర్డర్ కేసు పెట్టారని మండిపడ్డారు. అసలు పోలీసులకు మెదడు ఉందా? చదువుకున్నారా? లేదా అని ప్రశ్నించారు. నల్లబాలు రీట్వీట్ చేసినందుకు 20 రోజులు జైలుకు పంపించారని చెప్పారు. రాహుల్ గాంధీ చెప్పే మొహబ్బత్ కా దుఖాన్ ఇదేనా అని నిలదీశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని.. రేవంత్ రెడ్డికి బానిసలా పనిచేస్తున్న అధికారులను హెచ్చరించారు. మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని.. మిత్తితో సహా జవాబు చెబుతామని వార్నింగ్ ఇచ్చారు. మూసీలో లక్షన్నర కోట్ల కుంభకోణం బయటపెడితే సీఎం రేవంత్ రెడ్డి లాగు తడిసిందని అన్నారు. మనం పోరాటం చేస్తేనే మూసీ కుట్రలు ఆగాయని చెప్పారు. లగచర్ల లో రేవంత్ రెడ్డి అల్లుడి కంపెనీ కోసం గిరిజనుల భూములు లాక్కోవడానికి కుట్రలు పన్నారని విమర్శించారు. లగచర్ల ఆడబిడ్డలకు బీఆర్ఎస్ అండగా నిలిచిందని తెలిపారు. కంచ గచ్చిబౌలి భూములపై పోరాటం చేసింది విద్యార్థులేనని అన్నారు. మీ పోరాటాలకు మన లీగల్ సెల్ అండగా నిలిచిందని తెలిపారు. పోరాడిన వారికే రాజకీయం గా అవకాశాలు వస్తాయని స్పష్టం చేశారు. లీగల్ సెల్ ద్వారా జిల్లాల వారీగా విద్యార్థులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. రా ష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.

## 'కాంగ్రెస్ కులగణన బూటకం'

-మొదటిపేజీ తరువాయి

పర్యటించిన రాంచందర్‌రావు.. గతంలో ఎమ్మెల్సీగా గెలిపించిన పాలమూరు ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. పాలమూరు నుంచి ఇంకా వలసలు తగ్గడం లేదని, సీఎం రేవంత్‌రెడ్డి దీనిపై దృష్టి సారించాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్న చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు,. రేవంత్‌రెడ్డికి ఢిల్లీ తిరగటమే సరిపోయిందంటూ ఎద్దేవా చేశారు. భవిష్యత్‌లో పాలమూరు బీజేపీకి అడ్డాగా మారబోతుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఎంత పెద్ద నాయకుడైనా పార్టీనే సుప్రీం అని ఆయన స్పష్టం చేశారు.

## రెండురోజులు భారీ వర్షాలు..

తెలంగాణలో రాగల రెండురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. బంగాళాఖాతంలోని వాయుగుండం డాల్టన్‌గంజ్ (జార?ండ్)కు 80 కిలోమీటర్ల దూరంలో ఉందని.. ఉత్తర ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్ మీదుగా పశ్చిమ దిశగా కదులుతూ ఈ నెల 27 నాటికి అల్పపీడన ప్రాంతంగా మారే అవకాశాలున్నాయని తెలిపింది. ఈశాన్య అరేబియా నుంచి ఉత్తర ఛత్తీస్‌గఢ్, జార?ండ్ మీదుగా పరిసర ప్రాంతాల మీదుగా వాయుగుండం కేంద్రం వరకు సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని పేర్కొంది. ఈ క్రమంలో శనివారం రాష్ట్రంలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హెచ్చరించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాల్లపల్లి, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆదివారం ఆదిలాబాద్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వివరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

## చేనేత రంగంలో తెలంగాణది ప్రత్యేక స్థానం

**హైదరాబాద్:** మహిళాశక్తి పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అందించే చీరల ఉత్పత్తిని వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అదేశించారు. చేనేత, జౌళిశాఖ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడుకకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సూచించారు. చేనేత రంగంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందన్న తుమ్మల.. రాష్ట్రానికి చెందిన వివిధ రకాల చేనేత వస్త్రాలను జాతీయ చేనేత దినోత్సవం రోజు ఏర్పాటు చేసే ప్రదర్శనలో ఆయా సంఘాల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. డిమాండ్‌కు అనుగుణంగా నాణ్యతతో వస్త్రాలను ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చేనేత రుణ మాఫీ పథకం లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేసి.. ఖాతాల్లో నిధులు జమచేయాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. నేతన్న పొదుపు, భరోసా పథకాలను పటిష్ఠంగా అమలు చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల దిశానిర్దేశం చేశారు.

## రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే 'తెలంగాణ జాగృతి' ఊరుకోదు: కవిత



**కుత్బుల్లాపూర్:** తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన 'లీడర్' శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కొత్త నాయకత్వాన్ని పెంపొందించాలనుకుంటున్నట్లు చెప్పారు. కాలానుగుణంగా తెలంగాణ జాగృతి తన పంథాను మార్చుకుందని అన్నారు. మన సంప్రదాయాలు, కట్టుబాట్లపై అవగాహన కల్పించుకోవడమే లీడర్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. "ఎప్పుడూ కొత్తగా ఉంటేనే సంస్థలు బతుకుతాయి. తల్లి గర్భంలో నుంచి ఎవరూ నాయకత్వ లక్షణాలతో పుట్టరు. నేర్చుకుంటూ, మార్చుకుంటూ ముందుకెళ్లేవాడే నాయకుడవుతాడు తప్ప.. మూస పద్ధతిలో కొనసాగేవాడు నాయకుడు కాలేడు. సామాజిక స్పృహ కలిగిన రాష్ట్రాల్లో తెలంగాణ 11 స్థానంలో ఉందని ఓ సర్వేలో తేలింది. తోటివారి గోప్యతకు, మర్యాదకు భంగం వాటిల్లకుండా పదునైన విమర్శలు చేయడం నేర్చుకోండి. పక్కవాడిని తిడుతున్నారంటే కంటెంట్ లేనట్లు అర్థం. మహాత్మాగాంధీ ఎప్పుడూ ఎమ్మెల్యేగానో, ఎంపీగానో లేరు. కానీ, ఇప్పటికీ ఆయన్ని గుర్తు చేసుకుంటాం. తెలంగాణ జాగృతి నుంచి గాంధీగిరీకి కొత్త భాష్యం చెప్పాల్సిన అవసరం ఉంది. సాంస్కృతిక నేపథ్యం లేకుండా ఏ జాతీ మనుగడ సాధించలేదు. సాంస్కృతిక నేపథ్యం లేని జాతి.. పునాది లేకుండా కట్టిన బిల్డింగ్ లాంటిది. తెలంగాణ జాతికి అద్భుతమైన నేపథ్యం ఉంది. దానిని పరిరక్షించేందుకే 'జాగృతి' పని చేస్తుంది. తెలంగాణ ఉద్యమ కాలంలో యాసను అవహేళన చేసిన ఓ వ్యక్తికి నంది అవార్డు ఇవ్వడాన్ని నిరసించిన ఒకే ఒక సంస్థ తెలంగాణ జాగృతి. నమ్మిన సిద్ధాంతం కోసం ఎంత పెద్ద వ్యక్తులైనా, ఎంత పెద్ద సమస్య అయినా ఎదురొడ్డి నిలిచిన సంస్థ ఇది. తెలంగాణ రాకముందు రాష్ట్రం కోసం పని చేశాం. వచ్చిన తర్వాత ప్రజల అభివృద్ధి కోసం పని చేశాం. రాష్ట్రానికి నష్టం జరుగుతుంటే తెలంగాణ జాగృతి ఊరకోబోదు" అని కవిత అన్నారు.

# కార్ రిపేర్ సాధ్యమేనా?

-మొదటిపేజీ తరువాయి

ఒకే రోజూ జాగృతి ఒకవైపు.. బీఆర్ఎస్వీ మరోవైపు కార్యక్రమాలు నిర్వహించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పార్టీలో ఆధిపత్యపోరు అన్నాచెల్లెళ్ల సవాల్ అన్నట్లుగా మారిందనే చర్చ నేతల్లో నడుస్తోందట. జాగృతి సంస్థను కవిత స్థాపించగా, బీఆర్ఎస్ పార్టీకి అనుబంధ సంస్థగా బీఆర్ఎస్వీ ఉంది?పార్టీకి కేటీఆర్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఇద్దరు ఒకే పార్టీలో ఉన్నా?ఒకే రోజు వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించడంతో పార్టీ కేడర్ లో మాత్రం గందరగోళానికి తెరదీసిందట. విద్యార్థి విభాగం నేతలతో కేటీఆర్ కార్యాచరణ. బీఆర్ఎస్ పార్టీలో కేటీఆర్, కవిత ఇద్దరు కీలకనేతలు. ఇద్దరూ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖరరావు వారసులే? అయినప్పటికీ పార్టీ ఎమ్మెల్సీగా కవిత ఉన్నప్పటికీ సొంత జాగృతి సంస్థ బలోపేతంపైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ జాగృతి ఆధ్వర్యంలోనే కార్యక్రమాలు చేపడుతూ యాక్టివ్ అవుతున్నారు. కేటీఆర్ పార్టీ బలోపేతంపై దృష్టిసారించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నారు. పార్టీ విద్యార్థి విభాగం నేతలను పరిస్థితులకు అనుగుణంగా కార్యక్రమాలు చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. నిత్యం ప్రజల్లో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న లీడర్ కార్యక్రమం. అయితే ఒకేరోజూ ఇటు జాగృతి శిక్షణ తరగతులు, అటు బీఆర్ఎస్వీ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. వేదికలు వేర్వేరు ప్రాంతాలు అయినప్పటికీ ఈ నెల 26న నిర్వహిస్తున్నట్లు కల్వకుంట్ల వారసులు ప్రకటించారు. జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే లీడర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ కవిత రెండు సెషన్లుగా నిర్వహించాలని నిర్ణయించారు. మరోవైపు బీఆర్ఎస్వీ సదస్సుకు హరీష్ రావు, కేటీఆర్ తో పాటు ముఖ్య నేతలు హాజరై రెండు సెషన్లలో పాల్గొని మార్గనిర్దేశం చేయనున్నారు. ఇది ఇప్పుడు గులాబీ పార్టీలోనే చర్చకు దారితీస్తుందట. యువత, విద్యార్థులను ఆకట్టుకోవడమే లక్ష్యంగా కవిత యాక్షన్ ప్లాన్. ఎందుకు ఒకేసారి అన్నచెల్లెలు ఒకే సారిప్రోగ్రాంలను ఫిక్స్ చేశారు? అసలు కారణం ఏంటి? ఒకరు ఒక తేదీలో.. మరొకరు ఇంకో తేదీలో శిక్షణ తరగతులు నిర్వహించవచ్చుకదా? అన్న చర్చ ఇప్పుడు హాట్ హాట్‌గా మారింది. ఆ క్రమంలో అసలు పార్టీలో ఏం జరుగుతుందనేది తెలియక కేడర్ లో అయోమయం నెలకొందట. కవిత యువత, విద్యార్థులను ఆకట్టుకోవడమే లక్ష్యంగా పక్కా ప్రణాళికలతో జాగ?తిని యాక్టివేట్ చేయాలని చూస్తున్నారు. యువత, మహిళలు, బహుజనులు రాజకీయాల్లో రావాలని ప్రతీ సందర్భంలోనూ పిలుపునిస్తున్నారు. అందులో భాగంగానే జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాజకీయశిక్షణ తరగతులకు శ్రీకారం చుట్టారు. తొలుత రాష్ట్రస్థాయిలో 'లీడర్' పేరుతో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు.అయితే ఆ కార్యక్రమాన్ని ఆమె గత నెల 15వ తేదీన ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల నుంచి జాగృతి ప్రతినిధులు రావాలని పిలుపు నిచ్చారు. ఫాంహౌస్‌కే పరిమితమవుతున్న మాజీ సీఎం కేసీఆర్. బీఆర్ఎస్ ఓటమి తర్వాత గులాబీ బాస్ ఫాంహౌస్‌కే పరిమితమవుతున్నారు. దాంతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ పార్టీని నడిపిస్తున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టే విధంగా కార్యక్రమాలను రూపొందిస్తూ ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. ఇక బీఆర్ఎస్ ముఖ్యులందరికీ కేసుల చట్రం బిగుసుకుంటుండటంతో? చిన్నబాస్‌కు పార్టీ నేతల సహకారం కూడా పూర్తి స్థాయిలో లభించడం లేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంద. అయినా తనదైన వ్యూహాలు అమలు చేస్తున్న కేటీఆర్ బనకచర్ల అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను బీఆర్ఎస్వీకి అప్పగిస్తూ తాజా కార్యక్రమానికి రూపకల్పన చేశారు?. విద్యాసంస్థల్లో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం. అందుకు తగ్గట్లుగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కార్యచరణ సిద్ధంచేశారు. బనకచర్ల ప్రాజెక్టుపై జంగ్ సైరన్ మోగించేందుకే ఈ నెల 19 నుంచి విద్యాసంస్థల్లో బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగా ఈ నెల 26న ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్స్ లో బీఆర్ఎస్వీ విభాగం రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నారు. ఆ ప్రోగ్రాం ఉదయం సెషన్ ను మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ప్రారంభిస్తుండగా? సాయంత్రం సెషన్ లో కేటీఆర్ పాల్గొని దిశానిర్దేశం చేయనున్నారు. బనకచర్ల ప్రాజెక్టుతో నష్టాలు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టాలని చూస్తున్నారు. పార్టీనే ప్రాణమంటున్న అన్నాచెల్లెలు. కల్వకుంట్ల అన్నాచెల్లెల్లు ఇద్దరూ ఎవరికి వారే పార్టీ తమకు ప్రాణం అంటూనే .. ఎవరికి వారు సొంతంగా యాక్షన్‌ప్లాన్లు ప్రకటించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

## సంపాదకీయం

# అణుశక్తిని మానవాళి శ్రేయస్సుకే..

రెండో ప్రపంచ మహా యుద్ధం మానవ చరిత్రలో అత్యంత ఘోరమైన పరిణామాలను మిగిల్చింది. 1945లో జపాన్ దేశంలోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అమెరికా సంయుక్త రాష్ట్రాలు వేసిన అణు బాంబుల ధ్వంసం లక్షలాది మంది అమాయక ప్రజల ప్రాణాలను హరించడమే కాదు, అక్కడి జీవ వ్యవస్థను శాశ్వతంగా ప్రభావితం చేసింది. ఈ ఘోర ఘట్టాల తరువాత అణుశక్తి అనే పదానికి ప్రపంచ వ్యాప్తంగా ఒక భయానక భావం ఏర్పడింది. ఇదే సమయంలో అదే శక్తిని మానవాభివృద్ధికి శాంతియుతంగా వినియోగించ వచ్చని విశ్వాసంతో, 1953 డిసెంబరు 8న అమెరికా అధ్యక్షుడు డ్వైట్ డి ఐజెన్ హవర్ ఐక్యరాజ్య సమితి ప్రధాన సభలో "శాంతి కోసం అణుశక్తి" అనే ప్రసంగం ద్వారా ఒక అభూత పూర్వమైన ఆలోచనను ప్రపంచ దృష్టికి తీసుకొచ్చారు. ఈ ప్రసంగం ప్రభావంతో అనేక దేశాలు అణుశక్తిని నియంత్రితంగా, శ్రేయస్సుకు అనుకూలంగా వినియోగించాలనే సంకల్పాన్ని పొందాయి.దీని ఫలితంగా 1956లో ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో 82 దేశాల ప్రతినిధులు సమావేశమై అంతర్జాతీయ స్థాయిలో ఒక అణుశక్తి సంస్థను ఏర్పరచాల్సిన అవసరాన్ని గుర్తించి దాని కోసం చట్టబద్ధంగా ఏర్పాట్లు చేశారు. ఈ చట్టం ప్రకారం 1957 జూలై 29న అనేక దేశాలు అంగీకార పత్రాలపై సంతకాలు చేయగా, అదే తేదీని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ ఆవిర్భావ దినంగా గుర్తించారు. ఆగష్టు 1, 1957న ఈ సంస్థ కార్యనిర్వాహకంగా తన విధులను ప్రారంభించింది. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో ప్రధాన కార్యాలయం ఉన్న ఈ సంస్థ ప్రస్తుతం 178 దేశాలను సభ్యులుగా కలిగి ఉంది. అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకే పరిమితం చేయాలనే సంకల్పంతో ఈ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా అణుశక్తి వినియోగంపై పర్యవేక్షణ, నియంత్రణ, సహకారం వంటి కర్తవ్యాలను నిర్వర్తిస్తోంది. ఈ సంస్థ యొక్క ముఖ్య ఉద్దేశ్యం అణుశక్తిని నాశనానికి కాదు, మానవాళి శ్రేయస్సుకు ఉపయుక్తంగా మలచడం. విద్యుత్ ఉత్పత్తి, వ్యాధి నివారణ, వ్యవసాయ పరిశోధన, నీటి శుద్ధి వంటి అనేక రంగాలలో అణుశక్తిని వినియోగించేందుకు మార్గదర్శకత్వం కల్పించడం సంస్థ ధ్యేయంగా ఉంది. ఈ లక్ష్యాల సాధనకు ప్రపంచం లోని అణుశక్తి కేంద్రాలపై తనిఖీలు నిర్వహించడం, భద్రతా ప్రమాణాలను రూపొందించడం, సాంకేతిక సహకారాన్ని అందించడం, శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అణు పదార్థాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, ఆయుధాల తయారీని నిరోధించేందుకు సంస్థ నిరంతరంగా చర్యలు తీసుకుంటోంది.ఈ సంస్థ అణుశక్తిని శాంతికోసం వినియోగించే దిశగా చేసిన విశేష కృషికి గుర్తింపుగా 2005లో నోబెల్ శాంతి బహుమతి లభించింది. ఇది ఈ సంస్థతోపాటు అప్పటి ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఎల్ బరదైకి కూడా వరించింది. అణుశక్తి వ్యాప్తిని నిరోధించడంలో, శాంతియుత అవసరాలకు దాన్ని వినియోగించడంలో, ప్రపంచ దేశాల మధ్య నమ్మకాన్ని పెంపొందించడంలో చేసిన కృషికి ఇది ప్రశంసాపాత్రమైన గుర్తింపు. భారత దేశం ఈ సంస్థలో 1957 నుంచే సభ్య దేశంగా కొనసాగుతోంది. భారత దేశానికి అణుశక్తి రంగంలో విశేష అనుభవం, స్వావలంబన ఉన్నప్పటికీ, అణుశక్తి వ్యాప్తిని నిరోధించే ఒప్పందంపై అభ్యంతరాలు ఉన్నందున దాని పక్కన నిలిచి, ఐఎఇఏతో సాంకేతిక, శాస్త్రీయ పరంగా సహకార బంధం కొనసాగిస్తూ ఉంది. 2008లో భారత దేశం అమెరికాతో శాంతియుత అణుశక్తి ఒప్పందం చేసుకున్న సందర్భంగా, ఐఎఇఏతో ప్రత్యేక పర్యవేక్షణ ఒప్పందానికి అంగీకరించింది. దీని ప్రకారం భారత దేశంలోని కొన్ని అణుశక్తి కేంద్రాలు ఈ సంస్థ పర్యవేక్షణకు లోబడి ఉన్నాయి.భారత దేశంలో ప్రస్తుతం 22 అణు విద్యుత్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో కొన్ని కేంద్రాలు అంతర్జాతీయ పర్యవేక్షణలో ఉన్నాయి. భారత అణుశక్తి శాఖ, భాభా అణు పరిశోధన సంస్థ, అణు విద్యుత్ సంస్థ, అంతరిక్ష పరిశోధన సంస్థ తదితర శాస్త్రీయ సంస్థలు ఐఎఇఏ సహకారంతో అనేక అంతర్జాతీయ పరిశోధన కార్యక్రమాలలో పాలుపంచు కుంటున్నాయి. వ్యవసాయ రంగంలో విత్తనాల అభివృద్ధి, కీటక నాశక పరిశోధనలు, నీటి పరిశుద్ధత విశ్లేషణ, వ్యాధి నిర్ధారణ పరికరాలు, క్యాన్సర్ చికిత్సల్లో న్యూక్లియర్ వైద్యం వంటివి ఈ సంస్థ సహకారంతో భారత దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాలుగా నిలిచాయి. ప్రపంచ వ్యాప్తంగా విద్యుత్ ఉత్పత్తిలో దాదాపు పదిశాతం వరకు అణుశక్తిపై ఆధార పడుతున్నది. శుద్ధమైన, కాలుష్య రహిత శక్తి మూలంగా అణు శక్తికి ప్రాధాన్యం పెరుగుతున్నది. కానీ, అణు ప్రమాదాల భద్రతపై పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఐఎఇఏ భద్రతా ప్రమాణాలను మరింత కఠినతరం చేసింది. ఉక్రెయిన్‌లోని జాపొరిజ్యా అణుశక్తి కేంద్రంపై యుద్ధ భయాలు నెలకొన్న సందర్భంలో ఐఎఇఏ నేరుగా తన పరిశీలకులను పంపించి భద్రతా నివేదికలు అందజేయడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నమ్మకాన్ని ఏర్పరిచింది. ఇరాన్ అణుశక్తి ఒప్పందం, ఉత్తర కొరియా అణు పరీక్షలపై పర్యవేక్షణ వంటి వ్యవహారాలలో కూడా సంస్థ తన పాత్రను బలంగా నిలబెట్టుకుంది. 1957 జూలై 29న స్థాపితమైన అంతర్జాతీయ అణుశక్తి సంస్థ నేడు శాంతికోసం శాస్త్రీయంగా, నియంత్రితంగా అణుశక్తిని వినియోగించే దిశగా విశ్వ వ్యాప్తంగా మార్గనిర్దేశకంగా నిలుస్తోంది. శాంతియుత ప్రయోజనాలకు అణుశక్తిని వినియోగించాలన్న సంకల్పాన్ని నెరవేర్చే దిశగా వ్యవహరించిన ఈ సంస్థ అణుశక్తికి కొత్త నిర్వచనాన్ని ఇచ్చింది. నాశనానికి మార్గమైంది అన్న నెగిటివ్ అభిప్రాయాన్ని తొలగించి, శాంతి కోసం వినియోగించే శక్తిగా అణుశక్తిని మలచ గలమని ప్రపంచానికి చాటి చెప్పింది. శాస్త్రీయ విజ్ఞానాన్ని మానవ సంక్షేమానికి ఉపయోగించే దిశగా ఐఎఇఏ చేస్తున్న కృషి అభినందనీయం. భవిష్యత్ తరం అవసరాల కోసం భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, జాగ్రత్తగా అణుశక్తిని వినియోగించాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తూ ఐఎఇఏ మానవాళికి సుస్థిర అభివృద్ధి దిశగా వెలుగు చూపుతున్నది.

# పిల్లల జీవితాల్లో కీలక భూమిక అమ్మనాన్నలదే !



"మాతృదేవోభవ, పితృదేవోభవ" అంటున్నది హిందూ సమాజం. అమ్మ లేనిదే జన్మ లేదు. నాన్న లేనిదే లోక జ్ఞానం కలగదు. అమ్మ బుడిబుడి అడుగులు వేయిస్తే, నాన్న బిడ్డ చేయి పట్టి లోకాన్ని పరిచయం చేస్తాడు. అమ్మ నాన్నలే ఆది దేవతలు. శిశువుకు తొలి గురువు అమ్మ అయితే రెండవ గురువుగా నాన్న నిలుస్తాడు. పిల్లల్ని కనడానికి ముందు నుంచే అమ్మనాన్నలు సంతానవృద్ధి కోసం తమ జీవితాలను అంకితం చేస్తారు. గర్భం దాల్చిన అమ్మ నవ మాసాలు కడుపులో బిడ్డను మోసి, పోషించి, ప్రసవ వేదనను అనుభవించి, బిడ్డను కని, తను పునర్జన్మను పొంది మురిసి పోతుంది. శిశు దశ నుంచి పెరిగే ప్రతి క్షణం నాన్న పాత్రతో పాటు త్యాగం అనన్యసామాన్యంగా ఉంటుంది. అమ్మనాన్నల కు పిల్లలే ప్రపంచం, వారి అభివృద్ధే ఆనందం, వారి నవ్వులే తమ అంతిమ లక్ష్యం అని మనకు తెలుసు. తల్లితండ్రులు అయ్యే వరకు అమ్మనాన్నల పాత్ర మనకు పూర్తిగా అవగతం కాదు. నేటి డిజిటల్ యుగంలో పిల్లలకు, తల్లితండ్రులకు మధ్య ఏవో తెలియని తెరలు అడ్డుపడుతున్నాయి. తల్లితండ్రులు పిల్లలతో గడపడానికి విలువైన సమయమే సన్నుపూసైంది. తల్లిదండ్రుల ప్రాధాన్యాన్ని గ్రహించి, వారితో జీవితకాలం చేతిలో చేయి వేసి నడవడం, పిల్లలతో తల్లిదండ్రుల సంబంధాలు బలపడడం, జీవిత చరమాంకంలో తల్లితండ్రులకు ఆసరాగా ఊతకర్ర వలె నిలవడం అనే లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి ఏట నాలుగవ ఆదివారం, అనగా 27 జూలై 2025 రోజున "నేషనల్ పేరెంట్స్ డే లేదా జాతీయ తల్లితండ్రుల దినోత్సవం" పాటించడం 1995 నుంచి ఆనవాయితీగా మారింది. తల్లితండ్రులు పంచే బేషరతు ప్రేమ, పెంపకంలో చూపే ప్రత్యేక శ్రద్ధ, పిల్లల ఎదుగుదలలో చూపే అలుపెరుగని తపనలకు ప్రత్యామ్నాయం లేదు. పిల్లలు ఎదిగిన తర్వాత తమ తల్లితండ్రులను అక్కున చేర్చుకొని, ఊత కర్రగా మారి, వారి ఆయురారోగ్యాలకు మనస్ఫూర్తిగా దోహదపడాలి, అమ్మానాన్నల రుణం కొంతైనా తీర్చుకునే ప్రయత్నాలు చేయాలి. తల్లి ప్రత్యక్ష పేగు బంధం పరమ పవిత్రం. తండ్రి తెర వెనుక త్యాగాలు పిల్లల ఎదుగుదలకు మూల స్థంభాలు. జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం రోజున తమ జన్మ ప్రదాతలను తగు రీతిలో దైవ సమానంగా సన్మానించుకోవాలి. కుటుంబ పెద్దలుగా తల్లితండ్రులు తమ పిల్లలకు జీవితకాలం పాటు రక్షణ గొడుగులు. కుటుంబానికి ఇల్లు తండ్రి అయితే ఆ ఇంటి దర్వాజకు ఆకు పచ్చ తోరణం, గడపకు పసుపు పారాణి లాంటి శుభం అమ్మ అవుతుంది. 2025 జాతీయ తల్లితండ్రుల దినం వేదికగా ఎదిగిన పిల్లలకు తల్లితండ్రులను చూసుకునే బాధ్యతలను వివరించడం జరగాలి. తల్లితండ్రులు పిల్లలకు భావోద్వేగ మద్దతు, అవసర పోషణను అందించడం, ఉజ్వల భవితకు బాటలు వేయడం, లోక జ్ఞానాన్ని అందించడం, సంస్కారాలను నూరి పోయడం, క్రమశిక్షణ కల్పించగలగడం లాంటి ప్రధాన అంశాలపై దృష్టి పెడతారు. వృద్ధ తల్లిదండ్రులు పిల్లల నుండి ఆప్యాయతను మాత్రమే కోరుకుంటారని నేటి యువత తెలుసుకోవాలి. పిల్లల శారీరక, మానసిక, సామాజిక, భావోద్వేగ, ఆధ్యాత్మిక అభివృద్ధికి అమ్మానాన్నలు హద్దులు లేని మద్దతు ఇస్తారు. పిల్లల కనీస అవసరాలను తీర్చడం, విద్యాబుద్దులు నేర్పించడం, సంరక్షణ బాధ్యతలు తీసుకోవడం, నైతిక శిక్షణను ఇవ్వడం, ప్రోత్సాహ స్ఫూర్తిని అందించడం, వివిధ సమయాల్లో అవసర సహాయం చేయడం, అవ్యాజమైన ప్రేమ – అనంతమైన ఆప్యాయతలను పంచడం, మానవ సంబంధాలను ఏర్పరచడం లాంటి గురుతర బాధ్యతలను తల్లిదండ్రులు స్వచ్ఛందంగా, తమ జీవిత ఏకైక లక్ష్యంగా తీసుకుంటారు. అలాంటి అమ్మానాన్నలను ఎదిగిన పిల్లలు చక్కగా, గౌరవంగా, భాధ్యతగా, ఆప్యాయంగా చూసుకోవడం, వారి త్యాగాలకు ధీటుగా పిల్లలు తిరిగి రుణం తీర్చుకోవడం కనీస కర్తవ్యం అని తెలుసుకొని మసలు కోవాలి. అమ్మానాన్నలను ఆది దేవతలుగా భావించాలి, వారి రుణాన్ని కొంతైనా తీర్చుకునే విశ్వ ప్రయత్నం చేయాలి.

# మూత్రపిండాల వైద్యంలో ఆద్యుడు

భారతదేశ వైద్య రంగ చరిత్రలో అత్యంత గౌరవనీయ స్థానం పొందిన వైద్యులలో డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ ముందుంటారు. ఆయనే భారత దేశంలో మొట్టమొదటి మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించిన శస్త్ర వైద్యుడు. ఆయన విజ్ఞాన పూరిత వైద్య నైపుణ్యంతో పాటు దేశ ప్రజల ఆరోగ్య సేవలో చేసిన అసాధారణ కృషికి గుర్తింపుగా పద్మశ్రీ అవార్డు వరించింది. దేశానికి వైద్యపరంగా మార్గ దర్శకుడిగా నిలిచిన ఈ మహోన్నత వ్యక్తిత్వం గల వైద్యుని జీవితాన్ని, సేవలను సవివరంగా విశ్లేషిద్దాం.డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ 1937 జూలై 27న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లోని బదౌన్ జిల్లాలోని నౌలిహరనాథ్పూర్ గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య తర్వాత లక్నో విశ్వ విద్యాలయానికి అనుబంధంగా ఉన్న కింగ్ జార్జ్ మెడికల్ కాలేజీలో వైద్య విద్యార్హతలు పొందారు. 1961లో ఎంబీబీఎస్, 1964లో ఎంఎస్ (జనరల్ సర్జరీ) పూర్తి చేశారు. తరువాత 1974లో ఇంటర్నేషనల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్, 1977లో అమెరికన్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ సర్టిఫికెట్లను పొందారు. ఈ సాంప్రదాయ, అంతర్జాతీయ ప్రమాణాల నైపుణ్యం ఆయనకు వైద్యరంగంలో విశిష్ట స్థానం కల్పించింది. 1973లో చండీగఢ్‌లోని ప్రఖ్యాత పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ లో ఆయన నేతృత్వంలో భారతదేశపు మొట్టమొదటి మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించ బడింది. ఈ ఆపరేషన్ వైద్య చరిత్రలో ఘనతను సాధించిన మైలురాయిగా నిలిచింది. ఆ కాలంలో సాంకేతిక పరిజ్ఞానం పరిమితంగా ఉండగా, ఓ రోగికి కొత్త జీవితం ప్రసాదించడం అతని వైద్య నైపుణ్యం, ధైర్యానికి అద్భుత ఉదాహరణ. ఇది కేవలం వైద్య విజయం కాదు, దేశ ప్రజారోగ్య చరిత్రలో ఒక గొప్ప ఉపాధి క్షేత్రాన్ని తెరలేపిన సంఘటన. ఆయన వైద్య సేవలు ఢిల్లీ ప్రభుత్వాసుపత్రులలో, ముఖ్యంగా రామ్ మనోహర్ లోహియా ఆసుపత్రి, గ్రేటర్ కాలకజీ ఆసుపత్రి వంటి ప్రఖ్యాత ఆసుపత్రులలో కొనసాగాయి. ఆయన శస్త్ర వైద్య విభాగానికి నాయకత్వం వహిస్తూ అనేకమంది శిక్షణ పొందిన వైద్యులను ట్రాన్స్ప్లాంటేషన్ స్పెషలిస్టులుగా తీర్చిదిద్దారు. కేవలం రోగుల సేవే కాకుండా, వైద్య విద్యార్థుల విద్యను, పరిశోధనను ప్రోత్సహించారు. ట్రాన్స్ప్లాంటేషన్‌కు సంబంధిత నైతిక, న్యాయపరమైన విధానాల రూపకల్పన లోనూ ఆయన గణనీయమైన పాత్ర పోషించారు.ఆయన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1982లో పద్మశ్రీ అవార్డుతో డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్‌ను సత్కరించింది. మూత్రపిండ మార్పిడి శస్త్ర చికిత్సల రంగంలో భారత దేశంలో ఈ అవార్డు అందుకున్న మొట్టమొదటి వైద్యుడు ఆయనే. అంతేకాకుండా, దేశ అధ్యక్షులు నీలం సంజీవ రెడ్డి, జ్ఞానీ జైల్ సింగ్, ఆర్. వెంకటరామన్‌లకు గౌరవ వైద్యుడిగా సేవలందించారు. ఇది ఆయన వైద్య నైపుణ్యానికి, వ్యక్తిత్వ మహిమాన్వితానికి అద్దం పడే ఘనత.ఆయన సేవా భావాన్ని, దాతృత్వాన్ని మరింత విస్తరించేందుకు "రాజ్ వీర్ సింగ్ యాదవ్ ఫౌండేషన్" స్థాపించ బడింది. ఈ సంస్థ భారతీయ సమాజాల్లో ఆరోగ్య, విద్య, సాధికారత తదితర రంగాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంది.డాక్టర్ యాదవ్ 2016 ఫిబ్రవరి 4న మరణించారు. ఆయన మరణం దేశ వైద్య సమాజానికి తీరని లోటు. కానీ ఆయన వేసిన పునాదులపై వేలాది మంది వైద్యులు నేడు దేశవ్యాప్తంగా మూత్రపిండ మార్పిడి సేవలందిస్తున్నారు. ఆయన చూపించిన మార్గం, నిబద్ధత, మానవతా విలువలు వైద్యసేవలోనూ, సామాజిక రంగాల్లోనూ చిరస్థాయిగా నిలుస్తాయి. వైద్య విజ్ఞానానికి, సేవాభావానికి మహోన్నత ప్రతీకగా నిలిచిన డాక్టర్ రాజ్ వీర్ సింగ్ యాదవ్ గురించి చెప్పినప్పుడు "వైద్యో నారాయణో హరిః" అన్న వాక్యం సహజంగా గుర్తుకు వస్తుంది. ఆయన జీవితానికి, సేవా యాత్రకు అదే యథార్థ కీర్తి.

# అపర భగీరథుడు ఆర్థర్ కాటన్

"నిత్య గోదావరీ స్నాన పుణ్యదోయోమహమతిః, స్మరామ్యాం గ్లేయ దేశీయం కాటనుం తం భగీరథం" ఆంధ్ర ప్రదేశ్ లోని ఉభయ గోదావరి నదీ తీర వాసులు గోదావరీ స్నానాల సమయంలో సంకల్పం చేసేప్పుడు పఠించే సాంప్రదాయం ఆచరిస్తారు. అపర భగీరుథుడైన ఆంగ్లేయ ఇంజినీర్ సర్ ఆర్థర్ కాటన్ కారణంగా తాము నిత్యం ఉదయాన్నే గోదావరి స్నానమా చరించే భాగ్యం కలిగిందన్నది దాని సారాంశం. కేవలం గోదావరి స్నానమాచరించే అవకాశమే కాదు, తమ జీవితాల్లో సమూల మార్పులకు మూలం ఆర్థర్ కాటన్ ఆలోచనే అని గోదావరి తీర వాసులు నేటికీ విశ్వసిస్తారు. అందుకు అనుగుణంగా ఆయనను నిత్యం తమ పూజా మందిరంలో కొలిచేవాళ్లు, తమ ఇంటి వద్ద, సమీపాలలో కాటన్ మహాశయుని విగ్రహాలు ఏర్పాటు చేసుకుని ఆరాధించేవాళ్లు చాలామంది కనిపిస్తారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రగతిలో అనేక అంశాలలో గోదావరి, కృష్ణా తీరం ముందు ఉండడంలో కాటన్ శ్రమ ఉందని భావించక తప్పదు. కాటన్ దొర అని గోదావరి ప్రజలు అభిమానంగా పిలుచుకొనే జనరల్ సర్ ఆర్థర్ కాటన్ (మే 15, 1803 – జూలై 24, 1899) బ్రిటిషు సైనికాధికారి, నీటిపారుదల ఇంజనీరు. కాటన్ తన జీవితాన్ని బ్రిటిషు భారత సామ్రాజ్యములో నీటిపారుదల, నావికాయోగ్యమైన కాలువలు కట్టించడానికి జీవితాన్ని ఫణంగా పెట్టిన మేధావి, కార్యశీలి. కాటన్ 15 ఏళ్ల వయసులో ఈస్ట్ ఇండియా కంపెనీ ఇంజనీరింగు సర్వీసుల్లో చేరి శిక్షణ పొందారు. 1819లో రాయల్ ఇంజనీర్స్ దళంలో సెకండ్ లెఫ్టెనెంట్‌గా నియమితుడైన ఆయన విధి నిర్వహణలో భాగంగా 18 ఏళ్ల వయసులో భారత దేశానికి వచ్చి మొదటిసారిగా మద్రాస్‌లో ఉద్యోగిగా పనిచేశారు. అక్కడి నుంచి ఈస్ట్ ఇండియా కంపెనీ తరుపున దక్షిణ భారత చెరువుల శాఖకు ఇంజనీర్‌గా నియమితులయ్యారు. ఆ సమయంలో 1828-29 మధ్య కాలంలో కావేరీ నది వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేశారు. కరువు పీడిత ప్రాంతం గోదావరి డెల్టాగా రూపాంతరం చెందడంలో ధవళేశ్వరం వద్ద నిర్మించిన ఆనకట్ట ప్రధాన పాత్ర పోషించింది. అప్పటి జిల్లా అధికారిగా ఉన్న సర్ హెన్రి మౌంట్ పంపించిన నివేదిక ఆధారంగా ఆనకట్ట నిర్మాణం ఆలోచన తెరమీదకు వచ్చింది. ఆర్థర్ కాటన్ అనే ఇంజనీరుకు సదరు ప్రతిపాదన అప్పగించి, సాధ్యాసాధ్యాలు పరిశీలించాలని బ్రిటీష్ ప్రభుత్వం అప్పగించడంతో ఆయన అందుకు అనువైన ప్రాంతం కోసం సుదీర్ఘ అన్వేషణ చేశారు. అలా 1840లోనే కృష్ణా నదిపై ఆనకట్ట నిర్మాణ సాధ్యాసాధ్యాలపై ఆయన రూపొందించి, ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను అప్పటి మద్రాసు గవర్నరు మార్కస్ ట్వేల్ డేల్ ఆమోదించారు. లండన్‌లోని బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఆమోదానికి పంపించారు. ప్రాజెక్టు రిపోర్టును పరిశీలించిన తర్వాత, 1846 ధవళేశ్వరం వద్ద గోదావరిపై ఆనకట్టను కాటన్ ఆధ్యర్యంలో నిర్మించేందుకు లండన్ నుంచి అనుమతి లభించింది. 1847 ఏప్రిల్ నెలలో ఆనకట్ట నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఆనకట్ట నిర్మాణంలో పది వేలమంది కూలీలతో పాటుగా ఐదు వందల మంది వడ్రంగులు, ఐదు వందల మంది కమ్మరులను వినియో గించారు. ధవళేశ్వరం వద్ద గోదావరి సుమారుగా 6 కి.మీ. వెడల్పు ఉంటుంది. 1847 అగస్టు మూడో వారంలో రైల్వే వ్యాగన్ల ద్వారా ఉక్కు, రాయిని ధవళేశ్వరానికి తరలించారు. దాంతో యంత్ర సామాగ్రితో నిర్మాణపు పనులు ముమ్మర మయ్యాయి. నది ఒడ్డుకు చేర్చిన రాళ్లు, ఇతర సామగ్రిని పడవల ద్వారా నదిలోని నిర్మాణ ప్రాంతానికి రవాణా చేసేవారు. ఇందుకు 25 టన్నుల భారం మోయగల 18 నావలను వినియోగించారు. కాటన్ కు కూలీలతో పాటుగా ఇంజనీర్లయిన భారతీయులు కూడా కొందరు తోడుగా ఉన్నారు. వారిలో తొలి నాటి ఇంజనీర్లలో ఒకరైన రాజ్ బహుదూర్ వీణం వీరన్న కూడా ఉన్నారు. కాటన్ పర్యవేక్షణలో ఈ ఆనకట్టను వేగంగా పూర్తి చేశారు.

# దేశ రక్షణలో యువత ముందుండాలి





**రామాయంపేట,జూలై26(సూర్యరేఖ)** దేశ రక్షణలో యువత ముందుండాలని రామాయంపేట ఎస్సై బాలరాజు సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశ రక్షణ కోసం యువకులు, ఆర్మీలో చేరాలని తెలిపారు.దేశ రక్షణ కోసం విరోచితంగా పోరాడి పాకిస్థాన్ కు ముచ్చమటలు పట్టించిన యుద్ధ వీరులను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పోరాటంలో వీరమరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించాలన్నారు. యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు.ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి రావాలన్నారు. దేశం కోసం ఎంతోమంది యువకులు సైన్యంలో చేరి దేశ సేవ కోసం పాటుపడుతున్నారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో షానిషా ఫౌండేషన్ చైర్మన్ శివ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ యాదగిరి ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యులు భాస్కర్ సత్యం కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి రెండో వార్డులోని సమస్యలను పరిష్కరిస్తాం







**కమిషనర్ రమేష్**

**"సూర్యరేఖ" కథనానికి స్పందన**

**బెల్లంపల్లి,జూలై26** (సూర్యరేఖ)బెల్లంపల్లి పట్టణం 2వ వార్డులో చిన్న పాటి వర్షపు చెరువును తలపిస్తున్నాయి అనే "సూర్యరేఖ" కథనంలో ప్రచురితమైంది.స్పందించిన మున్సిపల్ కమిషనర్ రమేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది పరిస్థితిని పరిశీలించారు.డ్రైనేజీ నిర్మాణానికి అడ్డుగా ఉన్న కట్టడాలను తొలగించాలని సంబంధిత ఇంటి యజమానులకు నోటీసులు అందజేశారు. త్వరలోనే డ్రైనేజీ నిర్మాణం చేపడతామని బస్తీ ప్రజలకు హామీఇచ్చారు.సమస్య ఎక్కడున్నా తమ దృష్టికి తీసుకురావాలని, ప్రజలు ఇబ్బంది పడకుండా అన్ని చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా కమిషనర్ రమేష్ తెలిపారు.

## బోనాలు ప్రశాంతంగా జెరిగేలా కృషి చేసిన పోలీస్ ఇన్స్పెక్టర్ కె.సునీల్ కు ఘన సన్మానం



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 26 (సూర్యరేఖ)** బోనాల ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జెరిగేలా కృషి చేసిన కూల్సుంపురా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.సునీల్ ను జీయగూడ ఇమంపురా నవ భారత సంఘం అధ్యక్షులు మధిర సత్యనారాయణ సంఘం సభ్యులతో మర్యాద పూర్వకంగా కలసి శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా మధిర సత్యనారాయణ మాట్లాడుతూ...పోలీసుల పనితీరు అభినందనీయమని రాత్రింబవల్లు తమ విధులను నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు శాంతి భద్రతలను కాపాడుతూ ఉండడం ప్రజలకు పోలీస్ లు ఎంతో మేలు చేస్తున్నారని కొనియాడారు. కూల్సుంపురా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కోరని సునీల్ మాట్లాడుతూ. శాంతి భద్రతల పరిరక్షణలొ ప్రజల సహకారం ఎంతో అవసరం అని అన్నారు.బోనాల ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించటానికి పాటిష్టమైనా పోలీస్ బందో బస్తును ఎర్పాటు చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నవ భారత సంఘం సలహాదారులు అర్.బాలకిషన్ డి.లక్ష్మి నారాయణ కోశాధికారి ఎం.మహేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి పాత గోడలు,కరెంటు స్తంభాల వద్ద నిలబడకండి

వెంకటేష్ యాదవ్.



**నాంపల్లి,హైద్రాబాద్,జూలై 26(సూర్యరేఖ)** ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి పాత ఇండ్లు, తడిసిన పాత గోడలు,కరెంటు స్తంభాల వద్ద నిలబడకూడదని భారతీయ జనతా పార్టీ జియాగూడ డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్ ప్రజకు విన్నవించారు.ఈ సందర్భంగా వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ...వర్షం కురుస్తున్న సమయంలో కరెంట్ కి సంబందంచిన పనులు చేయవద్దని,కరెంట్ ప్రవహించే స్తంభాలకు తాకవద్దని సూచిస్తూ చిన్న పిల్లలు బయట ఆడుకోవడానికి వెళ్తే పెద్దలు జాగ్రత్తవహించాలని హితవుపలికారు.అత్యవసరం ఉంటే తప్ప బయటికి వెళ్ళవద్దని వర్షం పడుతున్నపుడు రోడ్డు మీద చెట్ల కింద ఉండొద్దని తెలిపారు.ముందు జాగ్రత్తగా గోరు వెచ్చని నీరు తాగుతూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని వెంకటేష్ యాదవ్ ప్రజలకు సూచించారు.

## మాదిగ సేవా సమితి ఆర్థిక సాయం..



**కామారెడ్డి,జూలై 26(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం భవానిపేట గ్రామానికి చెందిన గంగని స్వామి కూతురు (9) సంవత్సరాలు ప్లేట్లెట్స్ పడిపోవడమే కాకుండా వెన్నుపూసలో నొప్పి రావడంతో రెండు కాళ్లకు స్పర్శ రావడం లేదు.వెంటనే హైదరాబాదు నిలోఫర్ హాస్పిటల్ లో చేర్పించి చికిత్స చేశారు.ఈ విషయం తెలిసిన కామారెడ్డి జిల్లా మాదిగ సేవా ఆధ్వర్యంలో రూ.12వేలు వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేశారు.చికిత్స పొందుతున్న అమ్మాయి తల్లిదండ్రులకు అందజేశారు.

## ఉస్మానియా యూనివర్సిటీ-రామంతపూర్ పెద్ద చెరువు వరకు నిర్మించే ఎస్ఎన్ డిపి పనులపై సమీక్ష..

కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్



**ఉప్పల్,జూలై 26 (సూర్యరేఖ)** ఉస్మానియా యూనివర్సిటీ నుంచి రామంతాపూర్ పెద్ద చెరువు వరకు నిర్మించే ఎస్ఎన్ డిపి పనులపై అధికారులతో కలిసి హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చైతన హరీష్ శనివారం వార్డు కార్యాలయంలో ఇరిగేషన్,మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... వరదముంపు నివారించేందుకు ఎస్ఎన్ డిపి కాలువ నిర్మించాలని సూచించారు.కాలనీవాసులకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన పనులు చేపట్టి పూర్తి చేయాలని,అవసరమైన సూచనలు ఇచ్చారు. కాలనీలు ఎలా సురక్షితంగా ఉంటాయో వాటిని పరిగణలోకి తీసుకొని పనులు పగడ్బందీగా చేపట్టాలన్నారు.ఈకార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు భేతి సుభాష్ రెడ్డి,ఎస్ఎన్ డిపి అధికారులు ఈ.ఈ.ఉమా దేవి డి.ఈ.అనురాధ, ఏ.ఈ.తిరుమలేష్,ఇంజనీరింగ్ ఏ.ఈ.సాయికిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## థ్యాంక్యూ రేవంతన్న..ఉప్పల్ డివిజన్‌కు మరోసారి భారీగా నిధులు..

అభివృద్ధి పనులకు రూ.7.39 కోట్లు మంజూరు..

కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి




**ఉప్పల్,జూలై26 (సూర్యరేఖ)**ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉప్పల్ డివిజన్‌కు భారీగా నిధులను మంజూరు చేస్తున్నారు. నాడు మల్కాజిగి ఎంపీగా ఉన్నప్పుడు ఈ ప్రాంత సమస్యలు తెలిసిన వ్యక్తిగా..నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ఉప్పల్ ప్రాంత అభివృద్ధికి రూ.7.39 కోట్ల నిధులను మరోసారి కేటాయించారు.ఉప్పల్ డివిజన్‌లోని న్యూ విజయపురి కాలనీ,సరస్వతికాలనీ సెవెన్‌హిల్స్‌కాలనీ గణేష్‌నగర్ శాంతినగర్ పద్మావతి కాలనీలలో సీసీ రోడ్ల పనులకు రూ.1.82 కోట్లు ఉప్పల్‌హిల్స్‌లో ఆర్‌సీసీ పైపులైను నిర్మాణానికి రూ.65 లక్షలు శ్రీరమణపురంలో ఆర్‌సీసీ పైపులైను నిర్మాణానికి రూ.98 లక్షలు,సౌత్ స్వరూప్‌నగర్‌లో ఆర్‌సీసీ పైపులైను నిర్మాణానికి రూ. 96 లక్షలు మాలబస్తీలో కమ్యూనిటీహాల్ బ్యాలెన్సు పనికి రూ.32 లక్షలు,సత్యనగర్‌లో కమ్యూనిటీహాల్ బ్యాలెన్సు పనికి రూ.20 లక్షలు విజయపురికాలనీలో కమ్యూనిటీహాల్ బ్యాలెన్సు పనికి రూ.20 లక్షలు,శాంతినగర్‌లో కమ్యూనిటీహాల్ బ్యాలెన్సు పనికి రూ.15 లక్షలు గణేష్‌నగర్‌లోని ఎస్సీ,ఎస్టీ శ్మశాన వాటికలో వివిధ రకాల అభివృద్ధి పనులకు రూ.90 లక్షలు హనుమాన్‌నగర్‌లోని హిందూ శ్మశాన వాటికలో వివిధ రకాల అభివృద్ధి పనులకు రూ.90 లక్షలు వెంకటేశ్వరకాలనీలోని ముదిరాజ్ శ్మశాన వాటికలో వివిధ రకాల పనులకు రూ.31 లక్షలు కేటాయించినట్లు ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి,కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి,లు తెలిపారు.పనులను త్వరలోనే ప్రారంభిస్తామని వారు వెల్లడించారు.

# పారిశుధ్య కార్మికులు బాధ్యతగా పనిచేయాలి

నిర్లక్ష్యంగా పనిచేసే కార్మికులపై చర్యలు..
పారిశుధ్య నిర్వహణపై ఆకస్మిక తనిఖీ..
వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి..
ఎఫ్ఎస్ఐలు సక్రమంగా విధులకు హాజరుకావాలి..
కార్పోరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు





**ఉప్పల్,జూలై26(సూర్యరేఖ)**పారిశుధ్య విభాగంలో పనిచేసే ఎస్ఎఫ్ఐలు విధులకు హాజరుకావడం లేదని రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావుకు ఫిర్యాదులు అందడంతో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించే విచారణ జరిపారు. పారిశుధ్య కార్మికుల హాజరు పట్టికను పరిశీలించి ఆయా ప్రాంతాల్లో పనితీరును తనిఖీ చేశారు.విధుల్లో నిర్లక్ష్యంగా వహిస్తే చేయించేది లేదని హెచ్చరించారు. అనంతరం శానిటేషన్ డీ.ఈ.చందన జవాన్ శ్రీశైలం ఎస్ఎఫ్ఐలు బిక్షపతి, బాబురావు కిషోర్ సతీష్ చంద్రకాంత్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ. జీహెచ్ఎంసీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు,పర్యవేక్షణ సిబ్బంది బాధ్యతగా పనిచేస్తేనే వందశాతం స్వచ్ఛతను సాధించవచ్చన్నారు. కొందరు కార్మికులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల లక్ష్యం నెరవేరడం లేదన్నారు.పారిశుధ్య కార్మికుల పనితీరును గమనించి హాజరు వేయాల్సిన ఎస్ఎఫ్ఏలు వారికి కేటాయించిన ఏరియాలోనే ఉండి పని చేయాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని నివారించేందుకు పారిశుధ్య పనులు సమర్థంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎస్ఎఫ్ఐలు,స్వీపర్లు పూర్తి సమయంతో విధుల్లో ఉండాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉందని, ప్రజలు ఫిర్యాదులు చేస్తే వెంటనే స్పందించి పారిశుధ్య నిర్వహణ పనులు సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

# 10వ తరగతిలో ఉత్తమ ర్యాంక్ సాధించిన విద్యార్థిని రామ్ చేతన్ ను సన్మానించిన కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్,జూలై26 (సూర్యరేఖ)** ఉప్పల్ లోని ప్రజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థి 10వ తరగతి పరీక్షలో 589 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి ఉప్పల్ కార్పొరేటర్ మందముల రజిత పరమేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఐఓజిటి ఇంటర్నేషనల్ సంస్థ వారి రూ.25 వేల చెక్కును కార్పొరేటర్ రజితా పరమేశ్వర్ రెడ్డి చేతుల ద్వారా విద్యార్థికి బహుకరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ. ఉప్పల్ ప్రజ్ఞాన్ విద్యార్థి మాస్టర్ వలిపే రామ్ చేతన్ పదవతరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాలతో పాటు ఉప్పల్ కి మంచి పేరు తీసుకొచ్చారాని కొనియాడారు. విద్యార్థులు చేతన్ ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ప్రజ్ఞాన్ యాజమాన్యం నాణ్యమైన విద్యానందిస్తూ ఉత్తమమైన ఫలితాలు సాధిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఓజిటి ఇంటర్నేషనల్ సంస్థ ప్రెసిడెంట్ దుబ్బ లక్ష్మారెడ్డి కోశాధికారి జెట్ట సుధాకర్ రెడ్డి జనరల్ సెక్రటరీ గోనె ప్రభాకర్ రెడ్డి,సంస్థ సభ్యులు మేకల రాంచందర్ రెడ్డి,మేకల రంగారెడ్డి, శామీర్పేట ధర్మారెడ్డి,షేర్ నర్సింహారెడ్డి సల్లా ప్రభాకర్ రెడ్డి,ప్రజ్ఞాన్ పాఠశాల యాజమాన్యం,సిబ్బంది పాల్గొన్నారు.

# "మోస్ట్ పాపులర్ వైశ్య మేల్"-2025 అవార్డును అందుకున్న డా. నరేష్ కుమార్ గజ్జల





**హైదరాబాద్,జూలై26 (సూర్యరేఖ)**గచ్చిబౌలిలోని ప్రధాన్ కన్వెన్షన్ లో ఘనంగా నిర్వహించిన వైశ్య లైమ్‌లైట్ అవార్డ్స్ లో టిఎక్స్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డా.నరేష్ కుమార్ గజ్జల 2025- సంవత్సరానికి "మోస్ట్ పాపులర్ వైశ్య మేల్" అవార్డును అందుకున్నారు.వైశ్య సమాజంలో విశిష్ట ప్రతిష్ఠ కలిగిన ఈ అవార్డ్స్ కార్యక్రమాన్ని ఎమ్మాడి ఆవిష్కరించారు. నిష్పక్షపాతమైన నాణ్యత ఆధారిత ఓటింగ్ విధానం ద్వారా విజేతలను ఎంపిక చేశారు.ఇది ప్రజాభిప్రాయానికి నిఖార్సైన అద్దంపట్టే విధంగా సాగింది.డాక్టర్ నరేష్ గజ్జల న్యూరోసర్జరీ రంగంలో చేసిన విశేష సేవలు రోగుల పట్ల ఆయన చూపిన మానవత్వం కమ్యూనిటీ ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఆయన కృషి ఈ అవార్డు అందుకోడానికి ప్రధాన కారణాలయ్యాయి.ఈ గౌరవాన్ని టిఎక్స్ హాస్పిటల్స్ గర్వంగా పంచుకుంటోంది.డాక్టర్ నరేష్ మాసంస్థకు చెందిన వారని,తన వైశ్య సమాజం లో ఉత్తమ వైద్యుడిగా గుర్తింపు పొందడం మాకెంతో గర్వకారణమని టిఎక్స్ యాజమాన్యం పేర్కొంది.ఆయన చికిత్సా నైపుణ్యం మానవీయ సేవాభావం,కమ్యూనిటీకి ఇచ్చిన విలువైన కృషికి నిదర్శనంగా నిలిచిందన్నారు.ఈ అవార్డ్స్ కు సుమధుర ఫౌండేషన్ ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరించింది. అదేవిధంగా మణేపల్లి జ్యువెల్లర్స్,వాసవి కన్స్ట్రక్షన్స్ యెమ్మడి జ్యువెలర్స్ వ్యవస్థాపకులు వంటి ప్రముఖ వ్యాపారవేత్తల మద్దతుతో ఈ కార్యక్రమం మరింత ఘనతను సంతరించుకుంది.ఈ కార్యక్రమం వైశ్య సమాజపు ప్రతిభ,విశ్వాసం, పరంపరల విలువలకు అద్దం పట్టేలా అత్యంత అర్థవంతంగా కొనసాగింది.

## వెంకటపూర్ (కె)తాండలో మోటార్ కు తాళం..



**నిజాంపేట,జూలై26(సూర్యరేఖ)** మండల పరిదిలోని వెంకటాపూర్ (కె)తండాలో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది.తండాకు నీటిని సరఫరా చేసే మోటార్‌కు తాళం వేసి నాలుగు రోజులు అవుతుండటంతో తండావాసులు బిందెలతో నీళ్లు మోసుకెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. గ్రామానికి వచ్చే బోరు నీరు కలుషితంగా వస్తుండటంతోనే మోటార్‌కు తాళం వేశామని గ్రామపంచాయతీ సిబ్బంది తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో నాలుగు రోజుల నుండి త్రాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆరోపించారు.ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని తండావాసులు కోరుతున్నారు

## విద్యుత్ వినియోగం పట్ల జాగ్రత్తలు వహించాలి..



**నిజాంపేట,జూలై26(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని గాంధీ రోడ్డు గల్లీకి సంబంధించి ట్రాన్స్ఫార్మర్ కాలిపోవడంతో వర్షం కూడా లెక్కచేయకుండా విద్యుత్ అధికారులు విధులు నిర్వహించి మరో ట్రాన్స్ఫార్మర్ ని బిగించారు.మండలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూసుకుంటున్నామని విద్యుత్ ఏఈ గణేష్ తెలిపారు.ఈ వర్షాకాలం ప్రజలు విద్యుత్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని,వర్షం పడే సమయంలో స్తంభాలు ముట్టుకోవద్దని ముఖ్యంగా వ్యవసాయ క్షేత్రాల వద్ద రైతులు కరెంటు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రతి ఒక్కరూ విద్యుత్ వినియోగం పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు.

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుక్స్ స్టేషనరీ పంపిణీ..

కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్



**ఉప్పల్,జూలై 26 (సూర్యరేఖ)**ఉప్పల్ నియోజకవర్గం నాచారం 6వ డివిజన్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 300 మంది విద్యార్థులకు స్మైల్ విత్ షైన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నోట్ బుక్స్,స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప్పల్ నియోజకవర్గం 6వ డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పాల్గొని పిల్లలకు బుక్స్, స్టేషనరీ అందజేశారు.వారికి స్మైల్ విత్ షైన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు స్కూల్ టీచర్స్ విద్యార్థులు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ సాంసన్,పాస్టర్ లాజరస్, సొసైటీ సభ్యులు గంగారపు సత్యపాల్,గ్రేస్ ఆర్థిల్ల మేరీ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తొలి ఓవర్లో రెండు వికెట్లు..
## కష్టాల్లో టీమిండియా!.. గంభీర్‌పై ఫ్యాన్స్ ఫైర్

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో.. రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన టీమిండియాకు ఆదిలోనే భారీ షాక్ తగిలింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్‌తో పాటు వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ కూడా డకౌట్ అయ్యాడు. ఇంగ్లండ్ బౌలింగ్ అటాక్ మొదలుపెట్టిన పేసర్ క్రిస్ వోక్స్ అద్భుతమైన డెలివరీలతో వీరిద్దరిని పెవిలియన్‌కు పంపాడు. తొలి ఓవర్లో నాలుగో బంతికి వోక్స్ సంధించిన బంతిని జైసూ షాట్ ఆడేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. బ్యాట్ ఎడ్జ్‌ను తాకిన బంతి గాల్లోకి లేవగా.. ఫస్ట్ స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న జో రూట్ చేతుల్లోకి వెళ్లింది. అయితే, క్యాచ్ పట్టడంలో తడబడిన రూట్.. ఎట్టకేలకు బంతిని జాగ్రత్తగా ఒడిసిపట్టాడు. దీంతో.. నాలుగు బంతులు ఎదుర్కొన్న జైస్వాల్... పరుగుల ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. ఇక జైసూ స్థానంలో వచ్చిన సాయి సుదర్శన్‌ను మరుసటి బంతికే వోక్స్ పెవిలియన్‌కు పంపాడు. వోక్స్ వేసిన బంతిని వదిలేయాలని సాయి భావించగా.. బాల్ అతడు ఊహించిన దానికంటే కాస్త ఎక్కువగానే జంప్ అయింది. ఈ క్రమంలో బ్యాట్ బాటమ్ ఎడ్జ్‌ను తాకిన బంతి.. సెకండ్ స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న హ్యారీ బ్రూక్ చేతుల్లో పడింది. దీంతో భారత్ తొలి ఓవర్లోనే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఇక అంతకముందు 669 పరుగులకు ఆలౌట్ అయిన ఇంగ్లండ్.. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో తొలి ఓవర్ ముగిసేసరికి 311 పరుగుల ఆధిక్యంలో కొనసాగడంతో పాటు..

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలి





**మల్కాజ్గిరి ఏసీపీ చక్రపాణి,ఉప్పల్ హెచ్ఎస్ హెచ్ఓ కు ఫిర్యాదు చేసిన ఉప్పల్ యూత్ కాంగ్రెస్ నేతలు**

**ఉప్పల్,జూలై26 (సూర్యరేఖ)** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిరాధారమైన ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే పాడి కౌశక్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మల్కాజ్గిరి ఏసిపి చక్రపాణి,ఉప్పల్ ఇంచార్జి ఎస్ హెచ్ఓ రామలింగారెడ్డి,లకు ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాలతో శనివారం ఉప్పల్ నియోజక వర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ యూత్ కాంగ్రెస్ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా ఆకారపు అరుణ్ పటేల్ మాట్లాడుతూ. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కౌశిక్ రెడ్డి చేసిన ఆరోపణలు నిరాధారమైనవని పార్టీలో పెద్దల మెప్పు పొందడానికి కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సచిన్,రామంతపూర్ డివిజన్ అధ్యక్షులు అశోక్, హబ్సిగూడ డివిజన్ అధ్యక్షులు వాసునాయక్, చిలుకానగర్ డివిజన్ అధ్యక్షులు నవకాంత్ రెడ్డి, ఉప్పల్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్,జావీద్, బాబీ,సాయి సుమిత్ రఘు,సురేష్,యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# మెహదీపట్నం ఫంక్షన్ హాల్ సీజ్ చేసిన తెలంగాణ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ అధికారులు






**తెలంగాణ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్ అధికారులకు యాజమాన్యం మధ్య తోపులాట..**
**స్పృహతప్పి పడిపోయిన అధికారి,చికిత్స పొందుతూ మృతి..**

**నాంపల్లి,హైద్రాబాద్,జూలై26(సూర్యరేఖ)** అసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెహదీపట్నం ఆర్టీసీ డిపో ముందు గల మెహేందిపట్నం ఫంక్షన్ హాల్ వద్ద ఉద్రిక్తత నెలకొంది.తెలంగాణ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్‌కు చెందిన అధికారులు న్యాయస్థానం ఆదేశాల మేరకు మెహేందిపట్నం ఫంక్షన్ హాల్ సీజ్ చేయడానికి రావడంతో ఫంక్షన్ హాల్ లీజ్ దారుడు భారీగా సహచరులను వారిపై ఉసిగొల్పడంతో తోపులాట జరిగింది.ఈ తోపులాటలో అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్ ఆర్.జగదీశ్వర్‌రావు స్పృహ తప్పి పడిపోవడంతో తోటి ఉద్యోగులు.ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆర్.జగదీశ్వర రావు మృతి చెందాడు. ఈ సందర్భంగా. తెలంగాణ హౌసింగ్ బోర్డ్ కార్పొరేషన్‌కు చెందిన అధికారులు మాట్లాడుతూ కోర్టు ద్వారా ఆర్డర్ తెచ్చుకొని శనివారం మెహేందిపట్నం ఫంక్షన్ హాల్ సీజ్ చేయడానికి వచ్చామని తెలిపారు. ముందస్తు సమాచారం ఇచ్చిన సరైన పోలీసు ఫోర్స్ లేదంటూ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసారు. మెహదీపట్నం ఫంక్షన్ హాల్ యాజమాన్యం 2014 నుండి లీజ్ అగ్రిమెంట్ ముగిసిందని,గత ఎనిమిది సంవత్సరాలుగా హౌసింగ్ బోర్డుకు లీజు దారుడు ఖాజా ఈసాకుద్దిన్,ఫంక్షన్ హాల్ యాజమాన్యం 1కోటి 22 లక్షలు బకాయలు డబ్బులు చెల్లించాల్సి ఉందని తెలిపారు.కోర్ట్ ఉత్తర్వుల ప్రకారం ముందుకు పోతామని అధికారులు తెలిపారు.

# ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ఘనంగా మౌంట్ ఫోర్ట్ లిట్ ఫేస్ట్ బాయ్ వేడుకలు





**ఉప్పల్,జూలై26 (సూర్యరేఖ)** ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో మౌంట్ ఫోర్ట్ లిట్ ఫెస్ట్ బాయ్ వేడుకలు శనివారం ప్రిన్సిపల్ రెవరెండ్ బ్రదర్ జోసఫ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఆశిష్ చౌహాన్ (ఎంబిబిఎస్,ఎండి కన్సల్టెంట్ డయాబెటాలజిస్ట్, కాంటినెంటల్ హాస్పిటల్స్) విచ్చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి డాక్టర్ ఆశిష్ చౌహాన్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరికి ఆరోగ్యం చాలా ముఖ్యమని, ఆరోగ్యంగా ఉంటేనే అన్ని రంగాలలో ఏకాగ్రతగా ఉండగలమని ఉద్ఘాటించారు.ప్రతి ఒక్కరికి జిజ్ఞాస క్రమశిక్షణ అంకిత భావం చాలా ముఖ్యమని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో లిటరరీ విభాగానికి చెందిన డిబేట్,డ్రమెటిక్ మోనోలాగ్ పోస్టర్ మేకింగ్, లిసన్ అండ్ పెన్,మెమొరీ టెస్ట్ డిక్లమేషన్,ఎస్సే రైటింగ్ తదితర అంశాలలో పోటీలు జరిగాయి. ఈ పోటీలలో 14 పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన ముగింపు వేడుకలకు ప్రొఫెసర్ అనంత సుధాకర్ బబిల్లి(రీజెంట్ ఆఫ్ టెక్సాస్ అండ్ యూఎస్ హయ్యర్ ఎడ్యుకేషన్)గెస్ట్ ఆఫ్ ఆనర్ గా జోస్ క్రిస్టఫర్ (యుఎస్ కన్సల్టెన్సీ) హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. విద్యార్థులలో దాగియున్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి విద్య,ఆటలు తదితర నైపుణ్యాలు తోడ్పడతాయని ఆకాంక్షించారు.వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు.ఈ పోటీలలో ఆల్ సెయింట్స్ హైస్కూల్ ఓవరాల్ ఛాంపియన్షిప్ మొదటి స్థానం సాధించగా రెండవ స్థానం లిటిల్ ఫ్లవర్ స్కూల్ ఉప్పల్ మరియు మూడవ స్థానంలో లిటిల్ ఫ్లవర్ హైస్కూల్ అబిడ్స్ కైవసం చేసుకున్నాయి.ఈ కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ విద్యాసంస్థల కరెస్పాండెంట్ రెవరెండ్ బ్రదర్ అరుణ్ ప్రకాష్, ప్రిన్సిపల్ రెవరెండ్ బ్రదర్ జోసఫ్, తదితరులు పాల్గొన్నారు.

## ఈత మొక్కలను నాటిన ఎక్సైజ్ శాఖ సిఐ నాగేశ్వరరావు..



**కొల్చారం,జులై 26( సూర్యరేఖ)** కొల్చారం మండలంలోని పైతర గ్రామంలోని దామర చెరువు కట్టపై శనివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో వెయ్యి ఈత మొక్కలను ఎక్సైజ్ శాఖ సిఐ నాగేశ్వరరావు నాటించారు.ఈ సందర్భంగా సిఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ స్వచ్ఛమైన కల్లు కోసం ఈత వనాన్ని పెంచాలని ప్రతి సంవత్సరం ఈత మొక్కలను నాటి సంరక్షించేందుకు ఆయా గ్రామాల గౌడ సంఘం సభ్యులకు బాధ్యతలు అప్పగించినట్లు సిఐ నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హెడ్ కానిస్టేబుల్ సరళ,ఫీల్డ్ అసిస్టెంట్ కవితగౌడ,సంఘం సభ్యులు పాల్గొన్నారు

## సిడిపిఓ ఉద్యోగం సాధించిన మాసాయిపేట అలేఖ్య..



**రామాయంపేట,జూలై26(సూర్యరేఖ)** రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన మాసాయిపేట అలేఖ్య సిడిపిఓ ఉద్యోగం సంపాదించడం జరిగింది.ఈ మేరకు శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట సిడిపిఓగా ప్రభుత్వం నియమిస్తూ మంత్రి సీతక్క చేతుల మీదుగా నియామక పత్రం అందుకోవడం జరిగింది. నిరుపేద కుటుంబానికి చెందిన అలేఖ్య సిడిపిఓ ఉద్యోగం సాధించడం పట్ల కుటుంబీకులతో పాటు గ్రామస్తులు ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంచి ఉద్యోగ సంపాదించి గ్రామానికి పేరు తెచ్చిన అలేఖ్యను గ్రామస్తులు అందరూ అభినందించారు

## కామారెడ్డిలో రోటరీ క్లబ్,కిమ్స్,ఐఎంఏ వారి ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరం..



**కామారెడ్డి,జూలై 26(సూర్యరేఖ)** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో శనివారం కామారెడ్డిలో రోటరీ క్లబ్, కిమ్స్,ఐఎంఏ హాస్పిటల్ వారి సంయక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ సందర్శించడం జరిగింది.ఈ కార్యక్రమంలో డి డబ్ల్యుఓ అధికారి ప్రమీల,కిమ్స్ హాస్పిటల్ డాక్టర్ మధు,రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ జైపాల్ రెడ్డి,ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ గిరెడ్డి,రవీందర్ రెడ్డి, ఎల్లారెడ్డి సిడిపిఓ రాణి,హాజరై జ్యోతి ప్రజ్వల చేశారు.ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ .. కామారెడ్డి జిల్లాలో కిమ్స్ హాస్పిటల్ వారు ఉచిత క్యాన్సర్ శిబిరం ఏర్పాటు చేయడం గొప్ప విషయం అన్నారు.దాదాపు 300 మంది ఈ క్యాన్సర్ పరీక్ష చేసుకోవడం జరిగిందని తెలియజేశారు.జిల్లాలో మొదటి సారి ఈలాంటి శిబిరం నిర్వహించడం వలన చాలా మంది నిరుపేదలకు ఉపయోగపడిందని చెప్పుకొచ్చారు.కిమ్స్ డాక్టర్ మధు మాట్లాడుతూ... కామారెడ్డి ఐయంఏ,రోటరీ క్లబ్ వారి సహకారంతో ఉచిత క్యాన్సర్ శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని,ఈ ఉచిత వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలకు అభినందనలు తెలిపారు.క్యాన్సర్ వ్యాధి భయానిక వ్యాధి కాదని,ప్రజలు క్యాన్సర్ పరీక్షలు చేసుకోవడం వల్ల ముందస్తుగా క్యాన్సర్ మహమ్మారిని అరికటవచ్చు అన్నారు.ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు శంకర్,సెక్రటరీ కృష్ణ హరి,ట్రెజరర్ వెంకటరమణ,రోటరీ సభ్యులు బాలరాజు,తదితరులు పాల్గొన్నారు.

## వర్షానికి పాత గోడలవద్ద,విద్యుత్ స్తంభాల వద్ద నిలబడకండి..

**రామయంపేట తాహసిల్దార్ రజనీకుమారి..**



**రామయంపేట,జులై26 (సూర్యరేఖ)** వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామాయంపేట తహసిల్దార్ రజనీకుమారి సూచించారు.కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లే రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా విద్యుత్ పనులు సాధ్యమైనంత వరకు సంబంధిత అధికారులతో చేయించుకోవాలని విద్యుత్ వైర్లకు, విద్యుత్ స్తంభాల వద్ద గాని రైతులు,పశువులను కూడా ఉంచకుండా చూడాలని ఆమె సూచించారు. శిథిలవస్తలో ఇంటిలో పాత గోడల వద్ద,కరెంటు స్తంభాల వద్ద నిలబడకూడదని ఆమె తెలిపారు. ముఖ్యంగా చిన్నపిల్లలు బయట ఆడుకోవడానికి వెళ్లకుండా పెద్దలు చూసుకోవాలని ఆమె వెల్లడించారు. అత్యవసరం ఉంటే తప్ప బయటకి వెళ్ళవద్దని,వర్షం పడుతున్నప్పుడు రోడ్డుమీద,చెట్ల కింద ఉండకూడదని అన్నారు.ముందు జాగ్రత్తగా గోరువెచ్చని నీరు తాగుతూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు.

# సీఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు.. పాడి కౌశిక్ రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు



**కామారెడ్డి,జూలై26(సూర్యరేఖ)** ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అలీ పిసిసి అధ్యక్షుల ఆదేశాల మేరకు ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్ రెడ్డిపై కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ లో పట్టణ అధ్యక్షులు పండ్ల రాజు,ఐరేని సందీప్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...మతి తప్పి పార్టీ మన్ననలు పొందాలని నీచపు ఆరోపణలు ఆరోపణలు చేయడంపై మండిపడ్డారు దమ్ముంటే సాక్ష్యాలతో ఆధారాలు బయట పెట్టమని సవాలు చేశారు.మహిళలను అడ్డుపెట్టుకొని గెలిచిన కౌశిక్ రెడ్డి అదే మహిళల పట్ల అనుచితంగా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు.ఫోన్ ట్యాపింగ్ సూత్రదారులు బీఆర్ఎస్ నాయకులే వారు జైలుకు వెళ్లే సమయం దగ్గరకు వచ్చిందని అన్నారు.హుజూరాబాద్ లో ఎమ్మెల్యే పదవి వదిలేసి హైదరాబాద్ లో కెసిఆర్ కుటుంబానికి వాచ్ మెన్ పని చేస్తున్నావా.? అని ఆరోపించారు.ఆధారాలు చూపెట్టాలని,ఇప్పటికే చాలాసార్లు చెప్పామని,ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకపోతే నిన్ను బయట తిరగనియ్యమని హెచ్చరించారు.హద్దులు దాటి ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోమని,ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేసిన చరిత్ర కౌశిక్ రెడ్డిదని అన్నారు.వార్తల్లో తన పేరు ఉండటం కోసం ఇంటివాళ్ళను కూడా ఫోన్ టాపింగ్ లోకి లాగడం కౌశిక్ రెడ్డి నీచ చరిత్రకు నిదర్శనమని అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రుల పట్ల చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని,బేషరతుగా క్షమాపణ చెప్పాలని,లేని ఎడల తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అశోక్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోనె శ్రీను,పంపరి లక్ష్మణ్,బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు పుట్నాల శ్రీను,రాజాగౌడ్,మాజీ కౌన్సిలర్లు జమీల్, కన్నయ్య,తేజపు ప్రసాద్,బట్టు మోహన్ లడ్డు, మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ సిరాజుద్దీన్,గంప ప్రసాద్, కడెం ప్రవీణ్ సబ్బని శంకర్,సర్వర్ కిరణ్,జమీల్, అనిల్,లక్కపత్ని గంగాధర్, శ్రీధర్, సోఫియాన్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు లేని డివిజన్ గా తీర్చిదిద్దడమే తన లక్ష్యం

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,జూలై 26 (సూర్యరేఖ)** నాచారం డివిజన్ ను సమస్యలు లేని డివిజన్ గా తీర్చిదిద్దుతానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నాచారం అన్నపూర్ణ కాలనీలోని కమ్యూనిటీ హాల్ ముందు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించే సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి,స్థానిక కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ తో కలిసి పనులను ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే, కార్పొరేటర్,లకు కృతజ్ఞతలు తెలియజేసి శాలువాలతో సత్కరించడం జరిగింది. రాఘవేంద్ర నగర్ అన్నపూర్ణ కాలనీలో దాదాపుగా అన్ని రోడ్లు కొత్తవి వేయించడం జరిగిందని ఈ రోడ్డుతో రాఘవేంద్రనగర్ చుట్టుపక్కల దాదాపుగా అన్ని రోడ్లు పూర్తయ్యాయని కార్పొరేటర్ తెలియజేశారు.డివిజన్లో మిగిలిన అభివృద్ధి పనులు అన్నీ కూడా ఒక్కొక్కటిగా మంజూరు చేయించి పూర్తి చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో డి.ఈ. బాలకృష్ణ,ఏఈ.వినీత్, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల కార్మికులకు కరెంటు ఇబ్బందులు





**బెల్లంపల్లి,జూలై26(సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణం హనుమాన్ బస్తీలోని సింగరేణి సబ్టేషన్ గోడ వర్షానికి కూలింది.దీంతో హనుమాన్ బస్తీ సహ మరికొన్ని ప్రాంతాలలో సింగరేణి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.సబ్టేషన్ గోడ శనివారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో కూలిపోయి విద్యుత్ సరఫరా నిలిచి పోయినప్పటికీ,సింగరేణి విద్యుత్ అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు.సింగరేణి అధికారుల నిర్లక్ష్యంతో సింగరేణి కార్మికులు కార్మికేతర్లు నానా అవస్థలు పడుతున్నారు.గతంలో సైతం గోడ కూలినప్పటికీ దానికి అధికారులు మరమ్మతులు చేయించలేదు. సబ్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం పోగయి పిచ్చి మొక్కలు పెరగడంతో విష కీటకాలు పాములు సైతం తిరుగుతున్నాయని చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురవుతు న్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు నిర్లక్ష్యం వీడి సింగరేణి సబ్ స్టేషన్ ని మరమ్మతులు చేయించాలని కార్మికులు కోరుతున్నారు.

## ఎన్ఐఆర్డీలోని భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమం ప్రిన్సిపల్ రవికిరణ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు..



**రాజేంద్రనగర్,జులై26(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ ఎన్ఐఆర్డీలోని భారతీయ విద్యాభవన్ విద్యాశ్రమం ప్రిన్సిపల్ రవికిరణ్ కు మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.గత 10 సంవత్సరాల నుండి ప్రిన్సిపాల్ గా పని చేస్తూ స్కూలు అభివృద్ధికి, విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో కృషి చేస్తున్న రవికిరణ్ కు రాజేంద్రనగర్ ప్రాంత ప్రజలు,విద్యార్థుల పేరెంట్స్ తరఫున శుభాకాంక్షలు తెలిపారు.ప్రతి సంవత్సరం ఎంతోమంది విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణతలై మంచి స్థానాల్లో ఉన్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐఆర్ఎస్ రిటైర్డ్ మెంబర్ అఫ్ భారతీయ విద్యా భవన్ విద్యాశ్రం హైదరాబాద్ కేంద్ర కమిటీ డాక్టర్ సిపి రామస్వామి,జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్,అడ్వకేట్ ధీరజ్ యాదవ్,బిజెపి డివిజన్ మాజీఅధ్యక్షుడు జి.బాబురావు జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

సిఐ వెంకటరాజాగౌడ్



**రామాయంపేట,జూలై26(సూర్యరేఖ)** ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రామయంపేట సర్కిల్ పరిధిలో ప్రజలు చెరువులు, కుంటల వద్దకు వెళ్ళొద్దని సిఐ వెంకటరాజాగౌడ్ తెలిపారు.రామాయంపేట సర్కిల్ పరిధిలో ప్రజలు అత్యవసరమైతేనే తప్ప ప్రయాణాలు చేయొద్దని వాహనదారులు అతి వేగంగా వాహనాలను నడపొద్దని,ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు.కాబట్టి అతి వేగంగా వాహనాలను నడుపొద్దని సూచించారు.ప్రమాద కారణాల దృష్ట్యా ఉదృతంగా ప్రవహిస్తున్న కాలువలు చెరువులు, కుంటలను చూడటానికి వెళ్లొద్దని తెలిపారు. రైతులు పొలాలో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్త వహించాలని విద్యుత్ స్తంభాలను,వైర్లను చేతులతో తాక వద్దని వెల్లడించారు. నీరు నిలువ ఉన్న విద్యుత్ స్తంభాల దగ్గర నుండి వెళ్లారాదు.వాగులు వంకలు బ్రిడ్జ్ లపై నుండి పొంగి, ప్రవహించే వాటి వద్దకు వెళ్లి దాటాడానికి ప్రయత్నించొద్దని చెప్పారు.శిధిల వ్యవస్థలో ఉన్న ఇండ్లలో నివాసం ఉండవద్దని, తడిగా ఉన్న కరెంట్ పోల్స్,ఎలక్ట్రిక్ వైర్స్ తాకవద్దని, చేపల వేటకు ఎవరు వెళ్ళవద్దని అన్నారు.అత్యవసర సమయంలో సమాచారం ఇవ్వాలని అన్నారు.

## బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలి..

రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పతంగి రాజభూపాల్ గౌడ్



**రాజేంద్రనగర్,జులై26(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ డివిజన్ ఆధ్వర్యంలో బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పతంగి రాజభూపాల్ గౌడ్ అన్నారు.బూత్‌స్థాయి నుంచి బీజేపిని బలోపేతం చేయాలని పతంగి రాజభూపాల్ గౌడ్ కోరారు. రాజేంద్రనగర్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో శనివారం డివిజన్ పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకోవడం జరిగింది. సంస్థాగతంగా బలంగా ఉన్నప్పుడే ఎన్నికలలో ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు.డివిజన్ పూర్తిస్థాయి కమిటీల నిర్మాణం ఉంటేనే పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతమవుతుందన్నారు. ఉపాధ్యక్షులు మల్లేష్ చారి తొండుపల్లి మల్లేష్ పి.సురేందర్ సరిత రెడ్డి,జనరల్ సెక్రటరీ యు.పవన్ రాజశేఖర్ రెడ్డి సెక్రటరీ కవిత విష్ణువర్ధన్ రెడ్డి అంబిక డి.పర్వతాలు యాదవ్ ట్రెజర్ శ్రీనివాస్ రెడ్డి,ఎగ్జిక్యూటివ్స్ మెంబర్స్ ఎల్.వెంకటేష్ నర్సింహ్మా జ్ఞానేశ్వర్ జంగయ్య సాగర్ రెడ్డి,ముత్యం రెడ్డి,విజయ్ కుమార్ ప్రకాష్ రెడ్డి శివశంకర్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

# ఆనందకరమైన ఆరోగ్యమే మహాభాగ్యం





**ప్రకృతి వైద్యంతో పలు రకాల ఉపయోగాలు..**

**ఘనంగా ప్రకృతి వైద్యం ఆరోగ్య సదస్సు..**

**హైదరాబాద్,జూలై 25 (సూర్యరేఖ)** మనిషి ఆనందకరమైన జీవితాన్ని గడపడానికి ఆరోగ్యంగా ఉండటమే మహాభాగ్యమని పలువురు వత్తలు అభిప్రాయపడ్డారు.సిద్ధార్థ ప్రకృతి ఆరోగ్య కేంద్రం..గ్రేటర్ ఇన్రా ప్రాజెక్ట్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ప్రకృతి వైద్యం ఆరోగ్య సదస్సు శనివారం ఘనంగా జరిగింది.తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఎం.నరసయ్య అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రముఖ మోటివేటర్ మంద దామోదర్ మాట్లాడుతూ. మనిషి సక్సెస్ కు అంతం లేదని,హ్యాపీనెస్ తో కూడిన సక్సెస్ సాధించే వరకు కృషి చేస్తూనే ఉండాలని అన్నారు.ధ్యానం, మెడిటేషన్ యోగలను నిత్య జీవితంలో అలవర్చుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని కొనసాగించవచ్చని ఆయన పేర్కొన్నారు. మనిషి తుది శ్వాస విడిచే వరకు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రకృతి నియమాలను పాటించాలని ప్రముఖ సామాజిక కార్యకర్త బొజ్జా బిక్షమయ్య సూచించారు.ప్రముఖ ప్రకృతి వైద్యులు టి.వెంకన్న, పిసివి.స్వామి ఎల్.వెంకన్నలు మాట్లాడుతూ ప్రకృతి వైద్యంతో పలు రకాల రుగ్మతలను రూపుమాపణమే కాకుండా దీర్ఘకాల వ్యాధులకు చికిత్సలను అందించవచ్చు అని అన్నారు.ప్రముఖ ఆక్యుపెం చర్ డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ. భారతీయ ప్రాచీన వైద్య చరిత్రలో ఆక్యుపంచరకు ఒక ప్రముఖ స్థానం ఉందని దాని ద్వారా పలు రకాల వ్యాధులకు చికిత్సలు అందించవచ్చని అన్నారు.గ్రేటర్ ఇన్రా ప్రాజెక్ట్స్ సీఎండి సయ్యద్ ఇమామ్,డైరెక్టర్లు నరసయ్య, వీరారెడ్డి,లు మాట్లాడుతూ...ప్రకృతి ఆరోగ్య నియమాల ద్వారా ఓవర్ వెయిట్ ను తగ్గించుకున్నామని తెలిపారు.40 రోజులపాటు ఫిట్ ఇన్ 40 కార్యక్రమాన్ని నిర్వహించి కఠోర దీక్షతో ప్రకృతి సహజ సిద్ధంగా వైద్య విధానాలను అవలంబిస్తూ ఆరోగ్య సమస్యలను పరిష్కరించామని వారు తెలిపారు.ఫిట్ ఇన్ 40 కార్యక్రమంలో పాల్గొన్న కె.వెంకటేశ్వర్లు కాకునూరు సుధాకర్ జైపాల్ రెడ్డి,సలీం సరిత కోటేశ్వరరావు తదితరులను ఈ సందర్భంగా సత్కరించి సన్మానించారు.

# రైతులకు వాతావరణ ఆధారిత సూచనలు







**రామయంపేట,జూలై26(సూర్యరేఖ)** ప్రస్తుతం గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపద్యంలో వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు వివిధ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటుగా వాతావరణ ఆధారిత సూచనలను అందించే క్రమంలో శనివారం శివాయపల్లి కోమటిపల్లి, రామయంపేట్ గ్రామాలలో వరి మొక్కజొన్న,ప్రత్తి పంటలను ఇన్చార్జి సహాయ వ్యవసాయ సంచాలకులు రాజనారాయణ సందర్శించి రైతులకు వివిధ సూచనలు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ...ఎక్కువ వర్షాలు కురిసిన క్షేత్రాల నుండి పొలాల నుండి మురుగునీటిని వీలైనంత తొందరగా తీసివేయాల్సి ఉంటుంది రాబోవు రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే నేపథ్యంలో రైతులు పొలాల్లో ఎరువులను మరియు పురుగుమందుల పిచికారిని వేసేటువంటి ఎరువులను తాత్కాలికంగా వాయిదా వేయాల్సిందిగా చెప్పారు. ముఖ్యంగా భారీ వర్షం ఉన్న ప్రాంతాలలో మురుగునీరు త్వరగా పోయే విధంగా కాలువలను ఏర్పాటు చేసుకోవాలి, ఉరుములు,మెరుపులతో కూడిన వర్షసూచన నేపద్యంలో రైతులు విద్యుత్ స్తంభాలు,విద్యుత్ తీగలను గమనించి పొలాల్లో తిరగాలని,మోటర్ స్టార్టర్ చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి,అదేవిధంగా చెట్ల కింద నిలవరాదని తెలిపారు.పశువులు,మేకలు గొర్రెలను చెట్ల కింద ఉండకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ముఖ్యంగా వర్షాలు ఎక్కువ కురిసిన నేపథ్యంలో పొలాల గట్ల వెంబడి నడిచేటప్పుడు విష సర్పాలు,విషకీటకాల నుండి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి,వివిధ పంటలలో ఈ కింది సూచనలు తప్పకుండా పాటించాల్సి ఉంటుంది ముఖ్యంగా వరి పంటలో నీటిముంపు గురి అయిన మడుల నుండి నీటిని వెంటనే తీసి మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలి,వర్షాలు తగ్గిన తర్వాత నాట్లు వేయని రైతులు నాట్లు వేసుకోవడానికి ప్రణాళిక చేసుకోవాలి,ముఖ్యంగా ఈ సమయంలో నారు పోసుకోవడానికి తగినంత సమయం లేనందున నేరుగా వెదజల్లే పద్ధతిలో వరి విత్తనాలను చల్లుకోవాలి కలుపు నివారణ కోసం చర్యలు చేపట్టాలి,పైపాటుగా 19.19.19 లీటర్ నీటికి 5 గ్రాములు లేదా నానో యూరియా లేదా నానో డిఏపి లీడర్ నీటికి రెండు మిల్లీలీటర్ల చొప్పున పైపాటుగా పిచికారి చేసినట్టయితే పత్ర రంధ్రాల ద్వారా పోషకాలు నేరుగా వెళ్లి పంటలకు తక్షణ శక్తిని అందిస్తాయి .ప్రత్తి పంటలో కురిసిన అధిక వర్షాల వల్ల ప్రత్తి పంటలో వడలు తెగులు ఆశించడానికి అనుకూలంగా ఉండే అవకాశం ఉంటుంది.తెగులు సోకిన మొక్కల యొక్క మొదల భాగంలో తడిచే విధంగా మూడు గ్రాముల కాపర్ ఆక్సి క్లోరైడ్ మందు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.ఈ ప్రక్రియను వారంలో రెండు సార్లు చేయాల్సి ఉంటుంది.వీలైతే మొక్కల మొదల్ల భాగంలో ఈ ద్రావణాన్ని పోసినట్టయితే మరింత మంచి ఫలితాలు ఉంటాయి.పంటలు త్వరగా కోలుకోవడానికి మల్టీకే ఐదు నుండి 10 గ్రాములు లీటర్ నీటికి కలిపి లేదా యూరియాను లీటర్ నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.లేదా నానో యూరియాను రెండు మిల్లీలీటర్లు లీటర్ ద్రావణాన్ని కలిపి పిచికారి చేసుకోవాలి,మొక్కజొన్నలో ముఖ్యంగా అధిక వర్షాల ప్రభావం వల్ల నీటి ముంపుకు తట్టుకోవడం కష్టం కాబట్టి వెంటనే మురుగునీటిని తీసే విధంగా తగు చర్యలు పాటించాలి,ప్రభావం వల్ల భాస్వరం లోపం ఏర్పడే అవకాశం ఉంటుంది దీని నివారణకు నానో డీఏపీని రెండు మిల్లీలీటర్లు కలిపి పిచికారి చేసుకున్నట్లయితే బాస్వరం లోపాన్ని నివారించవచ్చు,అదేవిధంగా 19.19.19 పోషకాన్ని లీటర్ నీటికి ఐదు గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి వివిధ కూరగాయ పంటల్లో అధిక వర్షాల ప్రభావం వలన నారు కుళ్ళు తెగులు ఆశించడానికి అనుకూలంగా ఉండే అవకాశం ఉంది.దీని నివారణ కోసం కాపర్ ఆక్సి క్లోరైడ్ అనే మందును మూడు గ్రాములు లీటర్ నీటికి కలిపి మొక్కల మొదల్లో పోయడం లేదా పిచికారి చేసుకోవాల్సి ఉంటుంది.ఆరుతడి పంటల్లో వర్షాలు కురవడం ఆగిన తర్వాత అంతర కృషి చేయడం ద్వారా కలుపు నివారణతో పాటుగా అధిక తేమను తొలగించుకునే అవకాశం ఉంది.

# గంగమ్మతల్లి బోనాలకు హాజరైన ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్,జూలై26(సూర్యరేఖ)** ఉప్పల్ న్యూవిజయ పురి కాలనీలో శ్రీగంగమ్మతల్లి బోనాలకు ముఖ్య అతిథిగా ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి,ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. శనివారం సాయంత్రం గంగమ్మ బోనాలు గంగ పుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గంగమ్మతల్లి ఆలయంలో రజిత పరమేశ్వర్ రెడ్డి,గంగపుత్ర సంఘం నాయకులు కాలనీ అద్యక్షులు లెల్లెల వెంకటేష్ జనరల్ సెక్రటరీ పబ్బు నరసింహ నాగిరెడ్డి తెల్కల మోహన్ రెడ్డి ఆంజనేయులు అంబటి యాదయ్య, కాయ హనుమంతు గొంగడి వెంకటేష్ గోపాల కృష్ణ, కిరణ్ యాదగిరి పూస సతీష్ ఇతర కాలనీ వాసులు తుమ్మల దేవి రెడ్డి లెక్కల అంజిరెడ్డి వెంకటేష్ సెట్ భీంసేన్,మోహన్ నాయక్,బొడిగె మల్లేష్ కాలనీవాసులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు.



## ఘనంగా రాయికోడ్ మండలం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు మక్షుద్ జన్మదిన వేడుకలు



**అందోల్,జులై26 (సూర్యరేఖ)**రాయికోడ్ మండలం మైనార్టీ యువ నాయకుడు మక్షుద్ జన్మదిన వేడుకలకు అభిమానుల,కుల బంధువులు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు పార్టీలకు అతీతంగా ఘనంగా నిర్వహించారు.ప్రతి రాజకీయ నాయకులు జన్మదిన వేడుకలకు హాజరై అక్షింతలతో ఆశీర్వదించి శాలువాతో ఘనంగా మక్షుద్ సన్మానించారు. ఛత్రపతి శివాజీ విగ్రహానికి రూ.5వేలు,నాగ్వర్ పీర్ల దర్గాకు ఒక లారీ లోడు ఇసుక అందజేశారు. ఈకార్యక్రమంలో వివిధ గ్రామాల మాజీ ఎంపీటీసీలు,మాజీ సర్పంచులు, మండలంలోని అన్ని గ్రామాల రాజకీయ నాయకులు, బందు మిత్రులు,కుల బంధువులు,అభిమానులు భారీగా సంఖ్యలో హాజరయ్యారు.

## యాలకులు బొడ్డు కొవ్వును కరిగించేస్తుంది!



యాలకులు గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. యాలకులు రక్తపోటును నియంత్రిస్తాయి. రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. డయాబెటిక్ రోగులు తమ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించుకోవడం చాలా ముఖ్యం. డయాబెటిక్ రోగులు రోజూ రెండు నుండి మూడు యాలకులను నమిలితే, వారు తమ రక్తంలో చక్కెర స్థాయిలను సులభంగా నియంత్రించుకోవచ్చు. వంటగదిలో సుగంధ ద్రవ్యాలు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన బహుమతి. ఉత్తమ ఔషధ గుణాలు కలిగిన సుగంధ ద్రవ్యాలలో యాలకులు ఒకటి. ఇందులో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ బి6, నియాసిన్ ఉంటాయి. యాంటీఆక్సిడెంట్ గుణాలు సమృద్ధిగా ఉన్న యాలకులు శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి. ఇందులో ఉండే ముఖ్యమైన నూనెలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. శ్వాసకోశ వ్యవస్థకు ప్రయోజనకరంగా ఉంటాయి. యాలకులను ప్రతిరోజూ ఖాళీ కడుపుతో నమిలి తింటే, అది అద్భుతమైన మౌత్ ఫ్రెషనర్‌గా పనిచేస్తుంది. యాలకులలో ఉన్న యాంటీ బాక్టీరియల్ లక్షణాలు నోటిలోని బ్యాక్టీరియాను తొలగిస్తాయి. యాలకులు గుండెను ఆరోగ్యంగా ఉంచుతాయి. యాలకులు రక్తపోటును నియంత్రిస్తాయి.

## తొలగిన అడ్డంకులు.. సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్



ఈ ఏడాది జరగాల్సిన పురుషుల ఆసియా కప్ టోర్నీకి అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. తటస్థ వేదికపై టోర్నీ నిర్వహణకు భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆమోదం తెలపడంతో మెగా ఈవెంట్‌కు లైన్ క్లియర్ అయింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ఆరంభం కానుందని ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ వెల్లడించాడు. ఈ విషయాన్ని శనివారం ప్రకటన ద్వారా ఆయన అధికారికంగా ధ్రువీకరించాడు. టీ20 వరల్డ్ కప్ నేపథ్యంలో ఈ ఎడిషన్‌ను పొట్టి ఫార్మాట్‌లోనే జరపనున్న విషయం తెలిసిందే. 'యూఏఈ వేదికగా ఈ ఏడాది పురుషుల ఆసియా కప్ నిర్వహించనున్నామనే విషయాన్ని మీకు తెలియజేయడానికి సంతోషిస్తున్నా. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ సెప్టెంబర్ 9 నుంచి 28వ తేదీ వరకూ జరుగుతుంది. లీగ్ దశ మ్యాచ్‌లు, నాకౌట్ మ్యాచ్‌ల తేదీలతో పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తాం' అని నఖ్వీ వెల్లడించాడు. షెడ్యూల్ ప్రకారం భారత్‌లో ఈసారి ఆసియా కప్ జరగాల్సింది. పాక్‌తో ఉద్రిక్తతల కారణంగా ఆతిథ్య హక్కులను వదులుకున్న బీసీసీఐ తటస్థ వేదికపై నిర్వహణకు తమకు అభ్యంతరం లేదని ఐసీసీకి, ఏసీసీకి తెలిపింది. దాంతో.. యూఏఈ గడ్డపై ఈ మెగా ఈవెంట్‌ను జరిపేందుకు ఏసీసీ సన్నాహకాలు ప్రారంభించింది. ఇంకా నెల రోజుల సమయమే ఉండడంతో.. షెడ్యూల్ ఖరారు చేయడంలో నిమగ్నమైంది ఏసీసీ.

**పసికూనలు తొలిసారి..**

ఆసియా వరల్డ్ కప్‌గా పేరొందిన ఈ టోర్నీలో ఎనిమిది జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ఆసియా క్రికెట్ మండలిలో సభ్య దేశాలైన భారత్, బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గనిస్థాన్, పాకిస్థాన్‌లు నేరుగా ఈ టోర్నీకి అర్హత సాధించాయి. పసికూనలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్, హాంకాంగ్ జట్లు తొలిసారి ఈ పోటీల బరిలో నిలిచాయి. గత ఎడిషన్‌లో లంకు షాకిచ్చి కప్‌ను ఎగరేసుకుపోయిన టీమిండియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా అడుగు పెట్టనుంది.

# మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలి

**ఖబర్దార్ ఆవుల రాజిరెడ్డి..**

**బీఆర్ఎస్ పార్టీ నాయకుల ఆగ్రహం..**



**కొల్చారం,జులై26(సూర్యరేఖ)** శుక్రవారం కొల్చారం మండల కేంద్రంలో రైతు వేదిక నందు జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి అధికారికంగా వచ్చిన నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డిని ఏం మొహం పెట్టుకొని వచ్చారని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అనడం పట్ల కొల్చారం మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి నర్సాపూర్ నియోజకవర్గ ప్రజల ఓట్ల చేత ఎన్నుకోబడ్డ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి హాజరయ్యారని అన్నారు.ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి జోలికి వస్తే జాగ్రత్త అని,ఖబర్దార్ రాజిరెడ్డి అంటూ కొల్చారం మండల బీఆర్ఎస్ నాయకులు అన్నారు.శనివారం కొల్చారం మండల కేంద్రంలో బీ ఆర్ఎస్ నాయకులు రవితేజరెడ్డి జన్మదిన వేడుకల అనంతరం కొల్చారం మండల బీఆర్ఎస్ నేతలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల బీ ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రాంపల్లిగౌరీ శంకర్ గుప్తా,ముఖ్యనాయకులు ముత్యంగారి సంతోష్ కుమార్,మండల యువత అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు,లు మాట్లాడుతూ...రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి అధికారికంగా నర్సాపూర్ ఎమ్మెల్యే హాజరయ్యారన్నారు.నీకు ఏ పదవి ఉన్నదని హాజరయ్యావు ప్రోటోకాల్ లేకున్నా ఎగిరెగిరి కొబ్బరికాయలు కొట్టడానికి ఎందుకు వస్తున్నావు అని ప్రశ్నించారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గత పది సంవత్సరాల కాలంలో అన్ని రంగాలలో ఎన్నో అభివృద్ధి పనులు కెసిఆర్ చేశారని తెలిపారు.అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి ఉచిత బస్సు తప్ప ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదన్నారు.కళ్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం ఇచ్చారా వృద్ధులకు 4000 పెన్షన్ ఇచ్చారా ఏం చేశారని సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్నావని ప్రశ్నించారు.నర్సాపూర్ నియోజకవర్గ ప్రజలు నీవు వద్దు అంటూ నీవు అవసరము లేదు అని నిన్ను పక్కకు పెట్టారని బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.నీకు చిత్తశుద్ధి ఉంటే కొల్చారం మండలంలో ఎన్ని పెండింగ్ పనులు ఉన్నాయో తెలుసుకొని అభివృద్ధి పైనదృష్టి పెట్టాలని అన్నారు. మా గత ప్రభుత్వము చేసిన అభివృద్ధి పనులను మర్చిపోయి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్ కుమార్ చిన్నగనాపూర్,రంగంపేట సొసైటీ చైర్మన్లు పిల్లల రాజాగౌడ్,మోతుకు మల్లేశం సాయిబాబాగౌడ్ కాశీనాథ్ సిద్ధి రాములు మురళి గౌడ్ రాజాగౌడ్ దొడ్ల ఆంజనేయులు రవీందర్ సోమ నర్సింలు మల్లేశం చిటుకుల సురేష్ నాగరాజుగౌడ్, కుమ్మరి వెంకటేశం మాజీ ఎంపీటీసీ ఆదామ్, జీవయ్య తదితరులు పాల్గొన్నారు.

# వినయవిధేయ రేవంత్

**హైదరాబాద్ :** బాస్ ఈస్ ఆల్వేస్ కరెక్ట్” అనే విధానం ఎవరు అవలంభిస్తారో వారికి ఏ రంగంలోనూ ఎదురుండదు అనేది నిత్య సత్యం. ముఖ్యంగా ఎదిగే నాయకులకు ఉండాల్సిన ప్రధాన లక్షణం అధినేతకు విధేయులుగా ఉండడం. అప్పుడే ఆ రంగంలో మనుగడ సాధ్యమవుతుంది. అయితే అధినేత పట్ల విధేయత చాటుకునేందుకు సమయం సందర్భం ఉండాలి. ఆ సమయం వచ్చినప్పుడు ఏ స్థాయిలో మీ విధేయత చాటుతారో ఆ స్థాయిలో మీకు అంతర్గతంగా, బహిరంగంగా మద్దతు ఉంటుందనే రహస్యం తెలిసిన నాయకుడు రేవంత్ రెడ్డి. అధినేతకు విధేయత గా ఉండడం రేవంత్ రెడ్డికి అనుభవపూర్వకంగా వచ్చిన ఉన్నతమైన లక్షణం.రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, ఊహాగానాలకు ఒకే స్టెప్పుతో చెక్ పెట్టేశాడు. అధిష్టానం రేవంత్ విషయంలో అసంతృప్తితో ఉన్నారు, ముఖ్యమంత్రిని మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి, ఆయన డిల్లీ వెళితే వారి అధినాయకత్వం అపాయింట్మెంట్ ఇవ్వడం లేదు అని మీడియాలో వ్యతిరేక పార్టీ నాయకుల వ్యాఖ్యలను తిప్పికొట్టారు.అన్నిటికీ ఏకైక పరిష్కారం హైకమాండ్. వారితో ఏవిధంగా వ్యవహరించాలో ముఖ్యమంత్రికి తెలిసినంతగా



రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులకు కూడా తెలియదని డిల్లీలో జరిగిన కుల గణన పై ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించిన సమావేశంలో ఆయన వ్యవహరించిన తీరును చూస్తే అర్థమవుతుంది. ముఖ్యమంత్రిగా హుందాను ఒకవైపు ప్రదర్శిస్తూనే, మరోవైపు అధినాయకత్వంపై తనకున్న అభిమానాన్ని ఎలాంటి భేషజాలు లేకుండా వేదికపైన ప్రదర్శించడం కనిపించింది. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తనను మెచ్చుకుంటూ రాసిన లేఖను చూపిస్తూ ఆ లేఖ తనకు ఒక నోబెల్ బహుమతిగా, ఒక ఆస్కార్ అవార్డుగా భావిస్తున్నట్లు ప్రకటించారు. ఆ మాటలకు వేదిక కింద ఉన్న రాహుల్, ప్రియాంకలను ఇంప్రెస్ చేశాయనడంలో సందేహం లేదు. వారు ఆయన మాటలకు స్పందిస్తూ చిరునవ్వులు చిందిస్తూ, కారచాలనం చేసి మరీ అభినందించడం చూశాం.నాయకుడిగా ఎదగాలంటే చేయాలంటే, అధినాయకుడి ఎపుడూ కార్యకర్తగా మెలగాలి. లేకుంటే రాజకీయ భవిష్యత్తు అగమ్య గోచరమౌతుందని అందరు తీసుకోవాల్సిన సత్యం. అలాగే అధినాయకత్వానికి తాను అత్యంత సన్నిహితుడనని, ఎన్ని పిల్లిమొగ్గలు వేసినా, నష్టపోయేది మీరేనని కూడా ఎగిరెగిరి పడుతున్న సీనియర్ నాయకులకు ఈ విధంగా ఒక సందేశం ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఏది ఏమైనా రేవంత్ రెడ్డిని ఇబ్బంది పెట్టేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా హైకమాండ్ ఆశీస్సులు ఉన్నంతవరకు ఏది జరగదు అనే విషయం తేటతెల్లమైంది.

# ఫ్యూచర్ శంషాబాద్

**హైదరాబాద్ :** దేశవ్యాప్తంగా విమానాశ్రయాల సమీప ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ బూమ్ కొనసాగుతోంది. ముఖ్యంగా హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చుట్టుముట్టిన గ్రామాలు, పట్టణాల్లో భూముల ధరలు ఆశ్చర్యకరమైన రీతిలో పెరిగినట్లు తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కరోనా తర్వాతి కాలంలో ? అంటే 2021 నుంచి 2025 మధ్య ? ఈ పెరుగుదల మరింత వేగంగా నమోదైందని నివేదికలు చెబుతున్నాయి. విమానాశ్రయానికి 50 కిలోమీటర్ల పరిధిలో డిమాండ్ కొనసాగుతోందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు.విమానాశ్రయం అభివృద్ధికి ముందు, శంషాబాద్ పరిధిలో భూముల రేట్లు చాలా తక్కువగా ఉండేవి. 1990ల చివరలో చదరపు గజం ధర రూ.500లోపే ఉండేదని అప్పటి రియల్ ఎస్టేట్ డీలర్లు చెబుతున్నారు. కానీ ఇప్పుడీ ప్రాంతం పూర్తిగా మారు రూపం దాల్చింది. శంషాబాద్, బుద్వేల్, సాతంరాయి, మామిడిపల్లి, తుక్కుగూడ వంటి ప్రాంతాల్లో గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్మెంట్లు, విల్లా ప్రాజెక్టులు భారీగా నిర్మాణంలో ఉన్నాయి. ఇవన్నీ విమానాశ్రయానికి 25-50 కిలోమీటర్ల పరిధిలో ఉన్నాయిరియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ స్క్వేర్యార్డ్స్ ప్రకారం, గత ఐదేళ్లలో విమానాశ్రయం సమీప భూగర్భాలు సగటున 74 శాతం ధరల పెరుగుదలను చవిచూశాయి. అపార్ట్మెంట్ల ధరలు చదరపు అడుగుకు రూ.6,000 నుంచి రూ.8,000 మధ్యగా ఉండగా, ఇతర ప్రముఖ ప్రాంతాల్లో అదే చదరపు అడుగు ధర రూ.9,000 నుంచి రూ.11,000 వరకు ఉంది. స్థలాల విషయంలో చూస్తే, విమానాశ్రయం సమీపంలో చదరపు గజం ధరలు రూ.55,000 నుంచి రూ.60,000 మధ్య ఉన్నాయి. అదే సమయంలో ఇతర నగర ప్రాంతాల్లో ఇవే రేట్లు రూ.75,000 నుంచి రూ.80,000 వరకు వెళుతున్నాయి.వాస్తవానికి ఇప్పటివరకు శంషాబాద్ చుట్టుపక్కల అభివృద్ధి ఆశించిన స్థాయికి చేరలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. జీవో 111 పరిమితులు, పరిశ్రమలు లేకపోవడం వంటి కారణాలు ప్రధానమైనవని



వారు చెబుతున్నారు. అయినప్పటికీ, గత నాలుగైదేళ్లుగా దక్షిణ హైదరాబాద్ వైపు అభివృద్ధి బాగా ఊపందుకుంది. ప్రస్తుతం కొన్ని గ్రామాల్లో ఎకరం స్థలానికి రూ.4 కోట్లు పలుకుతుండగా, ఇంకా కొన్ని ప్రాంతాల్లో చదరపు గజం రూ.5,000 నుంచి రూ.10,000 మధ్యలో దొరికే అవకాశముంది. విల్లాల ధరలు రూ.కోటికి పైగానే ఉంటున్నాయి.ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా శంషాబాద్, తుక్కుగూడ, మహేశ్వరం ప్రాంతాల్లో మౌలిక వసతుల విస్తరణకు ప్రణాళికలు రూపొందించబడుతున్నాయి. నాగోల్ నుంచి ఆరంఘర్ మీదుగా విమానాశ్రయం వరకు మెట్రో రైలు విస్తరణ (లైన్ 2ఏ) ప్రతిపాదించబడింది. రాజేంద్రనగర్లో కొత్త హైకోర్టు భవనం నిర్మాణం జరుగుతోంది. శ్రీశైలం-నాగార్జునసాగర్ రహదారుల మధ్యలో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరగనుంది, ఇది విమానాశ్రయానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. ఇక్కడి నుంచి ఫ్యూచర్ సిటీ వరకు మెట్రో విస్తరణ యోచనలో ఉంది. మహేశ్వరం పారిశ్రామిక హబ్గా మారుతోంది. ఇటీవల ఓ జ్యువెలరీ తయారీ యూనిట్కు సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం కూడా జరిగింది.పలు బడా నిర్మాణ సంస్థలు రిటైర్మెంట్ హోమ్స్, టౌన్షిప్లు నిర్మించేందుకు భూముల సేకరణ చేపట్టాయి. ఇప్పటికే పలు విద్యాసంస్థలు, ఆధ్యాత్మిక కేంద్రాలు ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతున్నాయి. ప్రాంతీయ వలయ రహదారి పూర్తయ్యే దశలో ఉండటంతో, శంషాబాద్ పరిధి రాబోయే కాలంలో భారీగా అభివృద్ధి చెందే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

## చౌటుప్పల్ లో రోడ్డు ప్రమాదం

## ఇద్దరు డీఎస్పీల దుర్మరణం

**నల్గొండ :** చౌటుప్పల్ లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్ర ప్రదేశ్ కు చెందిన ఇంటెలిజెన్స్ డీఎస్పీ చక్రధర్ రావు, మరో డీఎస్పీ శాంతా రావు దుర్మరణం పాలయ్యారు. తీవ్రంగా గాయపడ్డ మరో అధికారి ప్రసాద్ ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయన పరిస్థితి విషమంగా వుంది. మృతులు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి డివైడర్ ను డీ కొట్టి అవతల వైపు వైపుకు దూసుకువచ్చింది. ఎదురుగా వచ్చిన లారీ కారును కొట్టింది. ఘటనలో ఇద్దరు డీఎస్పీలు . స్పాట్ లో ప్రాణాలు విడిచారు. ఇద్దరు డీఎస్పీల మృతిపై హోంమంత్రి అనితగ్భ్రాంతి వ్యక్తం చేసారు. విధినిర్వహణలోని పోలీసులు మరణించడం బాధాకరమని అన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని అన్నారు.

## ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు

## పాడి కౌశిక్ రెడ్డి నివాసం వద్ద ఉద్రిక్తత?

**బీఆర్ఎస్ శ్రేణుల మోహరింపు....**

**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు రాష్ట్రంలో రాజకీయ వేడిని రాజేశాయి. ఈ వ్యాఖ్యల పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ఎన్ఎస్యూఐ (ఔజఎ) కార్యకర్తలు పాడి కౌశిక్ రెడ్డిపై దాడి చేసే అవకాశం ఉందనే సమాచారంతో కొండాపూర్లోని ఆయన నివాసం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితిని పసిగట్టిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాడి కౌశిక్ రెడ్డి ఇంటికి చేరుకుంటున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేకు మద్దతుగా, కాంగ్రెస్ శ్రేణుల దాడిని అడ్డుకునేందుకు వారు మోహరించారు. కౌశిక్ రెడ్డి నివాసం పరిసరాల్లో పోలీసులు అదనపు బలగాలను మోహరించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## నాటు తుపాకుల కలకలం ..

## స్వాధీనం చేసుకున్న పోలీసులు

**ఖమ్మం :** ఖమ్మం జిల్లా కల్లూరు మండలం తాళ్లూరి వెంకటాపురం గ్రామం లో పోలీసులు అనుమతులు లేని నాటు తుపాకులను స్వాధీనం చేసుకోవడం కలకలం రేపింది. తాళ్లూరి వెంకటపురం గ్రామంలో చెరువు వద్ద కాపలాదారులైన ఘంటసాల లక్ష్మీనారాయణ, పెద్దిరాజు అనే ఇద్దరు వ్యక్తులు నాటు తుపాకులు కలిగి ఉన్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు దాడులు జరిపారు. నిందితులనుంచి అనుమతులు లేని రెండు నాటు తుపాకులు, గన్ పౌడర్ ను స్వాధీనం చేసుకున్నారు. లైసెన్స్ లేకుండా నాటు తుపాకీ కలిగి ఉండడంతో ఇద్దరి వ్యక్తుల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కల్లూరు పోలీసులు తెలిపారు.

## డిజిటల్ డిటాక్స్...

## వన్ మంత్ బ్రేక్!

**హైదరాబాద్ :** 'జబర్దస్త్' పేరు చెబితే తెలుగు ప్రేక్షకులకు ముందుగా గుర్తుకు వచ్చే సెలబ్రిటీలలో రష్మీ గౌతమ్ ఒకరు. ఆ షో యాంకరింగ్ చేయడం ద్వారా ఆవిడ చాలా పాపులర్ అయ్యారు. తన అభిప్రాయాలను సోషల్ మీడియాలో చాలా స్ఫూర్తిగా, నిర్మొహమాటంగా వెల్లడించే రష్మీ గౌతమ్, నెల రోజుల పాటు ఆ సోషల్ మీడియాకు బ్రేక్ ఇవ్వాలని డిసైడ్ అయ్యారు.'హలో... నెల రోజులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని (డిజిటల్ డిటాక్స్) నిర్ణయించుకున్నాను. వ్యక్తిగత జీవితంతో పాటు వృత్తిపరమైన అంశాలలోనూ కాస్త 'లో'లో ఉన్నాను (అనుకోనివి జరగడం వల్ల బాధ పడటం కావచ్చు). ఈ టైంలో నేను తీసుకునే నిర్ణయాలను సోషల్ మీడియా ప్రభావితం చేసే అవకాశం ఉంది. అందుకని, బ్రేక్ తీసుకుంటున్నాను. అయితే ఒక్కటి మాత్రం ప్రామిస్ చేయగలను. మరింత శక్తివంతంగా మీ ముందుకు వస్తాను. నేను మునుపటిలా హుషారుగా ఉండటానికి నా ఎనర్జీని మళ్ళీ పొందాలి. నా మీద ఎవరి ప్రభావం ఉండకూడదు. నేను ఎప్పుడూ స్టాంగ్గా ఉంటాను. అయితే కొన్ని విషయాలను సరి చేయాల్సిన సమయం వచ్చింది. నేను సోషల్ మీడియాకు కాస్త విరామం ఇస్తున్నా మీ ప్రేమ, అభిమానం ఎప్పుడూ ఇలాగే ఉంటాయని ఆశిస్తున్నాను” అని రష్మీ గౌతమ్ పేర్కొన్నారు.సోషల్ మీడియా నుంచి బ్రేక్ తీసుకోవడానికి గల కారణం ఏమిటో రష్మీ గౌతమ్ చెప్పారు. అయితే అది పూర్తిగా చెప్పలేదు. వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాల్లో లో ఫేజ్ నడుస్తుందని చెప్పారు. అది ఏమిటనేది చెప్పలేదు. దాంతో రష్మీకి ఏమైంది? ఉన్నట్టుండి ఎందుకీ నిర్ణయం తీసుకుంది? అని ఫ్యాన్స్ ఆలోచిస్తున్నారు. ఆవిడ బ్రేక్ ఇచ్చింది సోషల్ మీడియాకు మాత్రమే. టీవీ షోలకు కాదు. ప్రతి వారం 'జబర్దస్త్'లో రష్మీ గౌతమ్ సందడి కంటిన్యూ అవుతుంది. అయితే ఆ ఎపిసోడ్ డ్రస్ తో దిగిన ఫోటోలను ఆవిడ సోషల్ మీడియాలో షేర్ చేయరు, అది అసలు విషయం. సోషల్ మీడియాలో చేసే కామెంట్లు ఆవిడ దృష్టి వరకు వెళ్లవు. సో కాల్డ్ సోషల్ మీడియా నెగెటివిటీకి రష్మీ గౌతమ్ దూరంగా ఉండాలని డిసైడ్ అయ్యారు. ఇన్స్టాగ్రామ్లో ఆవిడ మూగ జీవాల గురించి ఎన్నోసార్లు పోస్టులు చేశారు. వాటి మీద కూడా వ్యతిరేకత వ్యక్తం అయిన సందర్భాలు ఉన్నాయి. అన్నిటిని తట్టుకుని రష్మీ గౌతమ్ బలంగా నిలబడ్డారు. ఇప్పుడు ఎందుకు బ్రేక్ ఇస్తున్నారో మరి? వెయిట్ అండ్ సి. వన్ మంత్ బ్రేక్ తర్వాత చెబుతారు ఏమో!?

## ప్రొఫెసర్ ఎంత పనిచేశాడో...

**హైదరాబాద్ :** హైదరాబాద్ జేఎన్టీయూలో ఓ ప్రొఫెసర్ చేసిన పొరపాటుతో 138 మంది విద్యార్థులు తమ చివరి సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిల్ అయ్యారు. ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ సబ్జెక్టు జవాబు పత్రాలను తప్పు ప్రశ్నపత్రంతో దిద్దడమే దీనికి కారణం. ఓ విద్యార్థి ఫిర్యాదుతో తప్పును గుర్తించిన అధికారులు, సరిచేసిన ఫలితాలను ప్రకటించారు. దీంతో ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యారు, అయితే ప్రొఫెసర్ నిర్లక్ష్యంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.హైదరాబాద్ జేఎన్టీయూలో ఓ ప్రొఫెసర్ చేసిన చిన్న తప్పు కారణంగా మూడు కాలేజీలకు చెందిన 138 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. పరీక్షా ఫలితాలు ఆలస్యంగా వెలువడటం, అందులోనూ తమ పిల్లలు కీలకమైన సబ్జెక్టులో ఫెయిల్ కావటం తెలిసి తల్లిదండ్రులు, విద్యార్థులు తీవ్ర ఆందోళన, ఆవేదన వ్యక్తం చేశారు. ఓ విద్యార్థి చేసిన ఫిర్యాదుతో పొరపాటును అధికారులు గుర్తించిన అధికారులు ఫలితాలను సరిచేసి తిరిగి ప్రకటించారు.వివరాల్లోకి వెళితే.. గత నెలలో జరిగిన జేఎన్టీయూ బీటెక్ నాలుగో ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను ఈ నెల 17న విడుదల చేశారు. ఈ ఫలితాల్లో చివరి ఏడాదిలో ఉండే క్రెడిట్ బేస్డ్ సబ్జెక్ట్ ఎన్విరాన్మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ లో శ్రీదత్త, మల్లారెడ్డి, షాదన్ కాలేజీలకు చెందిన 138 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ఇంజినీరింగ్ చివరి సంవత్సరంలో ఉన్న విద్యార్థులు కీలకమైన సబ్జెక్టులో ఫెయిల్ అవ్వడం వారిని తీవ్ర మనోవేదనకు గురిచేసింది. దీనివల్ల తమ భవిష్యత్తు, ఉన్నత విద్య అవకాశాలు దెబ్బతింటాయని ఆవేదన చెందారు.శ్రీదత్త కాలేజీకి చెందిన ఒక విద్యార్థికి ఈ ఫలితాలపై అనుమానం వచ్చి జేఎన్టీయూ పరీక్షల విభాగానికి మెయిల్ చేశాడు. ఇఎం సబ్జెక్టులో ఇంతమంది ఫెయిల్ అవ్వడానికి అవకాశం లేదని, మరోసారి ఫలితాలను చెక్ చేయాలని కోరాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు ఫలితాలను తనిఖీ చేయగా.. నిజంగానే 138 మంది విద్యార్థులు ఫెయిల్ అయినట్లు గుర్తించారు. ఆ తర్వాత వారి జవాబు పత్రాలను పరిశీలించగా.. వాటిని దిద్దిన ప్రొఫెసర్ ఘోరమైన పొరపాటు చేసినట్లు తేలింది. పరీక్ష ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో వేర్వేరు ప్రశ్నపత్రాలతో ఎగ్జామ్ నిర్వహించారు. అయితే ఆ ప్రొఫెసర్ ఉదయం ప్రశ్నపత్రంతోనే సాయంత్రం సెషన్ జవాబు పత్రాలను కూడా దిద్దినట్లు గుర్తించారు.ఈ తప్పిదాన్ని గుర్తించిన వెంటనే.. అధికారులు సాయంత్రం ప్రశ్నాపత్రంతో జవాబు పత్రాలను మళ్ళీ దిద్దించారు. ఫలితంగా, ఫెయిల్ అయిన విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యారు. గురువారం రాత్రి సరిచేసిన ఫలితాలను తిరిగి ప్రకటించారు. ఈ వార్త తెలియగానే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఒక ప్రొఫెసర్ నిర్లక్ష్యం కారణంగా ఇంతమంది విద్యార్థులు తీవ్ర ఒత్తిడికి గురికావడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ ఘటన జేఎన్టీయూ పరీక్షల పర్యవేక్షణలో లోపాలను ఎత్తి చూపిందని అంటున్నారు.

# బిజినెస్

## సరికొత్త విజన్‌తో ముందుకొచ్చిన ఎన్ఐఏటీ

ఇండియాలో ప్రతి సంవత్సరం లక్షల మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్స్ అవుతున్నారు. 2024 ఆర్థిక సర్వేలో కేవలం 51 శాతం గ్రాడ్యుయేట్స్‌కి మాత్రమే ఉద్యోగావకాశాలు వచ్చినట్లు తేలింది. అందుకే ఇప్పుడు ఇండియాలో చాలా యూనివర్సిటీలు ఒక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. ఇండియాలో ప్రతి సంవత్సరం లక్షల మంది విద్యార్థులు గ్రాడ్యుయేట్స్ అవుతున్నారు. 2024 ఆర్థిక సర్వేలో కేవలం 51 శాతం గ్రాడ్యుయేట్స్‌కి మాత్రమే ఉద్యోగావకాశాలు వచ్చిన్నట్లు తేలింది. అందుకే ఇప్పుడు ఇండియాలో చాలా యూనివర్సిటీలు ఒక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. చీ×ూలో కొలాబరేట్ అవ్వడం, నెక్స్ట్ వేవ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్సడ్ టెక్నాలజీస్ ఓ చక్కటి విజన్‌తో స్టార్ట్ అయింది. చీ×ూ 3 వేలకు పైగా కంపెనీలకు అసలు ఎలాంటి అద్భుతాలు కావాలి.. వారిలో ఏ స్కిల్స్ ఉండాలని ఇన్‌సైడ్స్‌ని రిపోర్టుగా చేసి యూనివర్సిటీలకు ఇస్తోంది. ఇలాంటి మరిన్ని సొల్యూషన్స్ కోసం.. యూనివర్సిటీలతో చీ×ూ కొలాబరేట్ అవుతోంది. చీ×ూ తెస్తున్న ఈ సొల్యూషన్స్‌కు.. ఎడ్యుకేషన్ సెక్టార్స్‌లో ఎంతో పేరు తెచ్చిన సందీప్ సన్‌శెట్టి కూడా అభినందించారు. విద్యారంగంలో ఇలాంటి మార్పు రావాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం చీజూ 2020లో పాలసీ ప్రవేశ పెట్టింది. ఈ కొలబరేషన్స్‌లో భారత దేశం టెక్ ఫ్యూచర్‌కు ఒక మంచి స్టార్ లభించింది.

## 7వ త్రైమాసికంలో పిఎటి ప్రగతిని సాధించి యస్ బ్యాక్

భారతదేశపు అతిపెద్ద ప్రైవేట్ రంగ రుణదాతల్లో ఒకటైన యస్ బ్యాంక్, గత ఏడాదితో పోల్చినప్పుడు ప్రాఫిట్ ఆఫ్టర్ టాక్స్ (పిఎటి) 59.4% ప్రగతి సాధించి, రూ. 801 కోట్లతో 2026 ఆర్థిక సంవత్సరాన్ని గొప్పగా ప్రారంభించింది. బలమైన సిఎఎస్ఎ పెరుగుదల అంకెలు (10.8% వై-ఒ-వై), నాన్-ఇంట్రెస్ట్ ఇన్కం (ఎన్ఐఐ) 46.1% వద్ద వుండడంబీ రిటర్న్ ఆన్ అస్సెట్స్ (ఆర్ఒఎ) ఎగువకి పెరగడం, స్థిరమైన అసెట్ క్వాలిటీ మెట్రిక్స్ వుండడం కూడా ఈ ఉరువడికి దోహదం చేశాయి. వరసగా గత 7 త్రైమాసికాల్లోనూ యస్ బ్యాంక్ పిఎటి ఏకరీతిగా పెరుగుతూనే వుంది, అలాగే వరసగా నాలుగో త్రైమాసికంలోకూడా నిర్వహణా లాభంకూడా పెరిగింది, గత ఏడాదితో పోల్చినప్పుడు 53.4% పెరిగి రూ. 1,358 వద్ద నిలిచింది. గత ఏడాదితో పోల్చినప్పుడు సిఎఎస్ఎ డిపాజిట్లు 10.8% శాతం పెరగ్గా, సిఎసిఎ నిష్పత్తి 32.8% కి పెరిగింది. రిటైల్, బ్రాంచ్ బ్యాంకింగ్ ద్వారా చేసిన డిపాజిట్లు, బ్యాంక్ ప్రగతికి ఆధారంగా నిలిచేయి, గత ఏడాదితో పోల్చినప్పుడు అవి 20% మేరకు పెరిగేయి. అలాగే, గత తొమ్మిదేళ్ళ కాలంలో బ్యాంక్ డిపాజిట్లు 43% నుంచి 35% కి తగ్గినట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్?బిఐ) చూపిస్తున్న కాలంలోనే, గత ఏడాదితో పోల్చినప్పుడు మొత్తంమీద డిపాజిట్లు 4,1% మేరకు పెరిగేయి. బ్యాంక్ తాలూకు వైవిధ్యమైన పోర్టుఫోలియోకి సూచిక అయిన వడ్డీయేతర ఆదాయం (ఎన్ఐఐ), ట్రెజరీ ఆదాయం సాయంతో గత ఏడాదితో పోల్చినప్పుడు గణనీయంగా 46.1% పెరిగి రూ. 1,752 కోట్ల వద్ద నిలిచింది. బ్యాంక్ తాలూకు దీర్ఘకాల ఆరోగ్యానికి ఒక సూచిక అయిన ఆర్ఒఎ, 2025 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికలో 0.5%గా వున్నది 2026 ఆర్థికసంవత్సరం తొలి త్రైమాసికలో 0.8% శాతానికి పెరిగింది. సొత్తు నాణ్యతా ప్రమాణాలు స్థిరంగా వున్నట్టు చూపిస్తోంది, గ్రాస్ నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్ (జిఎన్ పిఎ) 1.6% వద్దబీ నాన్-పెర్ఫార్మింగ్ అసెట్స్ 02.3% వద్ద వుండగా, ప్రొవిజన్ కవరేజ్ రేషియో 80.2% కి చేరి మెరుగుదల కనిపించింది. అడ్వాన్సులు భరణీయమైన ప్రగతిని కనబరుస్తున్నాయి, వాణిజ్య బ్యాంకింగ్ (ఏటికేడాది 19% ప్రగతి), మైక్రో బ్యాంకింగ్ (ఏటికేడాది 11.2% ఎదుగుదల), మొత్తంగా ప్రగతి అంకెలకి గత ఏడాదితో పోల్చినప్పుడు 5% మేరకు దోహదం చేసేయి.

# చరిత్ర సృష్టించిన భారత రైల్వే!




భారత రైల్వే మరో చరిత్ర సృష్టించింది. రోజురోజుకు టెక్నాలజీలలో దూసుకుపోతోంది. ప్రయాణికుల ప్రయాణాన్ని మరింత మెరుగ్గా ఉండేందుకు సరికొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇప్పుడు హైడ్రోజన్‌తో నడిచే ఇంజన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. భారత రైల్వే చరిత్ర సృష్టించింది. శుక్రవారం రైల్వేలు హైడ్రోజన్‌తో నడిచే రైలును విజయవంతంగా పరీక్షించాయి. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో ఈ ట్రయల్ నిర్వహించారు. ఆగస్టు చివరి నాటికి భారతదేశంలో మొట్టమొదటి హైడ్రోజన్‌తో నడిచే రైలును నడపడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఇది జింద్-సోనిపట్ మధ్య దాదాపు 90 కి.మీ. దూరం నడుస్తుంది. ఈ హైడ్రోజన్ రైలును కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ధృవీకరించారు. టెస్ట్ రన్ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీనితో పాటు, దాదాపు 35 ఇలాంటి రైళ్లను నడపడానికి ప్రణాళిక ఉంది. ఇది నాన్-ఏసీ రైలు అవుతుంది. దీనికి 2 హైడ్రోజన్ ఇంధన శక్తి ఇంజిన్లు ఉంటాయి. దీనితో పాటు దీనికి 8 ప్యాసింజర్ కార్లు అంటే కోచ్‌లు ఉంటాయి. ఈ రైలును ఉత్తర రైల్వే జింద్-సోనిపట్ ట్రాక్‌పై నడుపుతుంది. దీని వేగం గంటకు 110 కిలోమీటర్లు ఉంటుంది. 1200 హార్స్‌పవర్ ప్రోటోటైప్ హైడ్రోజన్ ఇంజిన్‌ను ఐసిఎఫ్ అభివృద్ధి చేస్తోంది. ఈ రైలు తక్కువ దూరాలను కవర్ చేయడానికి అభివృద్ధి చేసింది. ఐసిఎఫ్ జనరల్ మేనేజర్ సుబ్బారావు డెక్కన్ హెరాల్డ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. మొదటి పవర్ కారుగా పిలిచే దీనిని పరీక్షించామని చెప్పారు. రెండవ పవర్ కారును రాబోయే రెండు వారాల్లో పరీక్షిస్తారు. దీని తర్వాత, మొత్తం రైలును పరీక్షిస్తారు. ఇందులో 8 ప్యాసింజర్ రైళ్లు ఉంటాయి. ఆగస్టు 31 నాటికి మొదటి హైడ్రోజన్ ఆధారిత రైలును నడపాలని ప్లాన్ చేస్తున్నామని అన్నారు. తుది పరీక్షను ఉత్తర రైల్వే నిర్వహిస్తుంది. 2023లో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రాజ్యసభకు తెలియజేశారు. భారత రైల్వేలు "హైడ్రోజన్ ఫర్ హెరిటేజ్" చొరవ కింద 35 హైడ్రోజన్-శక్తితో నడిచే రైళ్లను నడపాలని యోచిస్తున్నాయని అన్నారు. ప్రతి రైలుకు రూ.80 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. కొండ మార్గాల్లో మౌలిక సదుపాయాలకు మద్దతు ఇవ్వడానికి ఒక్కో రూట్‌కు రూ.70 కోట్లు ఖర్చవుతుంది. ఉత్తర రైల్వేలోని జింద్-సోనిపట్ విభాగంలో నడపడానికి సిద్ధంగా ఉన్న హైడ్రోజన్ ఇంధన కణాలతో కూడిన డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్‌ను తిరిగి అమర్చడానికి రూ.111.83 కోట్ల విలువైన పైలట్ ప్రాజెక్ట్ కూడా ప్రారంభించినట్లు చెప్పారు. హైడ్రోజన్ రైళ్ల ప్రారంభ రన్నింగ్ ఖర్చు ఎక్కువగా ఉండవచ్చు. కానీ కాలక్రమేణా అది తగ్గుతుందని భావిస్తున్నారు.

# ఎల్ఐసీలో అద్భుతమైన స్కీమ్స్!

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో రకకరాల పాలసీలు ఉన్నాయి. మంచి కవరేజీ అందించే పాలసీలు ఉండగా, మంచి రాబడి అందించే పాలసీలు కూడా ఉన్నాయి. పెట్టుబడిదారులకు తమ ఆదాయం పెంచుకునేందుకు ఎల్ఐసీలో పాలసీలు ఉన్నాయి. జీవన్ శిరోమణి పాలసీ అనేది నాన్-లింక్డ్, వ్యక్తిగత జీవిత బీమా పొదుపు పథకం. ఇది బాగా సంపాదించే, వారి పెట్టుబడిని కాపాడుకోవాలనుకునే వారి కోసం ప్రత్యేకంగా రూపొందించింది. మీరు రూ. 1 కోటి బీమా మొత్తంతో పాలసీ తీసుకుంటే,కనీస నెలవారీ ప్రీమియం రూ. 94,000. ఈ ప్లాన్‌లో, మీరు 4 సంవత్సరాలు ప్రీమియం చెల్లించాలి. మీరు నెలవారీ, త్రైమాసిక, అర్ధ-వార్షిక లేదా వార్షిక ప్రాతిపదికన ప్రీమియం చెల్లించవచ్చు. ఎల్ఐసీ జీవన్ ఆనంద్ యోజన అనేది తక్కువ ప్రీమియంతో అద్భుతమైన రాబడిని ఇచ్చే టర్మ్ ప్లాన్. దీని ప్రత్యేకత ఏమిటంటే రోజుకు కేవలం రూ.45 పెట్టుబడి పెట్టడం ద్వారా మీరు భవిష్యత్తులో రూ.25 లక్షల వరకు నిధిని సృష్టించవచ్చు. నెలవారీ ప్రీమియం రూ.1,358,.దీనిని మీరు వార్షిక, అర్ధ-వార్షిక, త్రైమాసిక లేదా నెలవారీ ప్రాతిపదికన




జమ చేయవచ్చు. మీరు ఈ పాలసీలో బోనస్ ప్రయోజనాన్ని కూడా పొందుతారు. కానీ దీని కోసం కనీసం 15 సంవత్సరాలు పాలసీని కొనసాగించడం అవసరం. ఎల్ఐసీ జీవన్ ఆజాద్ పాలసీ అనేది నాన్-లింక్డ్, నాన్-పార్టిసిపేటింగ్, వ్యక్తిగత పథకం. ఇది ప్రారంభించినప్పటి నుండి ప్రజాదరణ పొందుతోంది. ఈ పథకంలో పెట్టుబడి కాలం 15 నుండి 20 సంవత్సరాలు. కనీస బీమా మొత్తం రూ. 2 లక్షలు. అలాగే గరిష్టంగా రూ. 5 లక్షలు. పాలసీ మెచ్యూరిటీ తర్వాత, బీమా కంపెనీ స్థిర మొత్తాన్ని ఏకమొత్తంగా చెల్లిస్తుంది. 90 రోజుల నుండి 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తులు ఈ పథకం ప్రయోజనాలను పొందవచ్చు. అంటే పాలసీని పిల్లల పేరుతో కూడా కొనుగోలు చేయవచ్చు. ఎల్ఐసీ జీవన్ ఉమాంగ్ పాలసీ అనేది నాన్-లింక్డ్, పార్టిసిపేటింగ్, హోల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్. ఇది రక్షణతో పాటు రెగ్యులర్ ఆదాయం ప్రయోజనాన్ని అందిస్తుంది. ప్రీమియం చెల్లింపు వ్యవధి పూర్తయిన తర్వాత, పాలసీదారుడు ప్రతి సంవత్సరం హామీ ఇచ్చిన మొత్తంలో 8% పొందుతారు. పాలసీ మెచ్యూరిటీ సమయంలో లేదా పాలసీదారుడి మరణం వద్ద ఏకమొత్తం మొత్తం ఇవ్వబడుతుంది. దీనితో పాటు, ఈ ప్లాన్‌లో రుణ సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఇది అవసరమైన సమయాల్లో ఆర్థిక సహాయం అందిస్తుంది. ఈ పాలసీ 100 సంవత్సరాల వరకు కవరేజీని అందిస్తుంది. ప్రీమియం చెల్లింపు వ్యవధి 15, 20, 25 లేదా 30 సంవత్సరాలు కావచ్చు. కనీస బీమా మొత్తం రూ. 2 లక్షలు. ఈ ప్లాన్ 3 సంవత్సరాల నుండి 55 సంవత్సరాల వయస్సు గల వారికి అందుబాటులో ఉంటుంది.

# స్పోర్ట్స్

# వైభవ్ సూర్యవంశీ మిస్సయ్యాడు!

## సౌతాఫ్రికా స్టార్ ప్రపంచ రికార్డు

సౌతాఫ్రికా యువ క్రికెటర్ జోరిచ్ వాన్ షాల్విక్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. యూత్ వన్డేల్లో డబుల్ సెంచరీ సాధించిన తొలి బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు. జింబాబ్వే అండర్-19 జట్టుతో మ్యాచ్ సందర్భంగా జోరిచ్ ఈ ఘనత సాధించాడు.

**విధ్వంసకర ఇన్నింగ్స్**

మూడు మ్యాచ్‌ల యూత్ వన్డే సిరీస్ ఆడేందుకు సౌతాఫ్రికా అండర్-19 జట్టు జింబాబ్వే పర్యటనకు వెళ్లింది. ఈ క్రమంలో మొదటి వన్డేలో జోరిచ్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. బౌండరీలు, సిక్సర్ల వర్షం కురిపిస్తూ టీ20 మాదిరి విధ్వంసకర ఇన్నింగ్స్‌తో విరుచుకుపడ్డాడు. కేవలం 153 బంతుల్లోనే 215 పరుగులు సాధించాడు జోరిచ్. అతడి ఇన్నింగ్స్‌లో ఏకంగా 19 ఫోర్లతో పాటు 6 సిక్సర్లు ఉన్నాయి. జోరిచ్ వీరోచిత ఇన్నింగ్స్ కారణంగా సౌతాఫ్రికా 385 పరుగుల మేర భారీ స్కోరు సాధించింది. అయితే, లక్ష్య ఛేదనలో జింబాబ్వే 107 పరుగులకే ఆలౌట్ అయింది. సౌతాఫ్రికా బౌలర్ల ధాటికి జింబాబ్వే బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలగా.. 278 పరుగుల తేడాతో సౌతాఫ్రికా ఆతిథ్య జట్టును చిత్తుగా ఓడించింది.

**యూత్ వన్డేల్లో తొలి ద్విశతకం**

ఈ మ్యాచ్ సందర్భంగా యూత్ వన్డేల్లో తొలి ద్విశతకం బాదిన క్రికెటర్‌గా జోరిచ్ రికార్డు సాధించాడు. గతంలోనూ



అతడు 200 పరుగుల మార్కుకు దగ్గరగా వచ్చి మిస్సయ్యాడు. బంగ్లాదేశ్ అండర్-19 జట్టుతో జరిగిన యూత్ వన్డేలో జోరిచ్ 156 బంతుల్లో 164 పరుగులు సాధించాడు. నాటి మ్యాచ్‌లో బంగ్లా విధించిన లక్ష్యాన్ని సౌతాఫ్రికా 44.4 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టపోయి ఛేదించింది. అలా ఆరోజు బంగ్లాపై విజయంలో కీలక పాత్ర పోషించిన జోరిచ్ వాన్ షాల్విక్.. తాజాగా జింబాబ్వేతో రికార్డు డబుల్ శతకంతో మెరిశాడు.

**వైభవ్ సూర్యవంశీ మిస్సయ్యాడు**

ఇదిలా ఉంటే.. భారత్ అండర్-19 జట్టు ఇటీవల ఇంగ్లండ్‌లో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నాలుగో యూత్ వన్డేలో చిచ్చరపిడుగు వైభవ్ సూర్యవంశీ కేవలం 52 బంతుల్లోనే శతకం సాధించి.. ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేశాడు. మొత్తంగా 78 బంతుల్లో 143 పరుగులు సాధించాడు. 13 ఫోర్లు, 10 సిక్సర్ల సాయంతో ఈ మేర భారీ శతకం నమోదు చేశాడు. అయితే, దీనిని డబుల్ సెంచరీగా మలచలేకపోయాడు. అలా వైభవ్ మిస్సయిన ప్రపంచ రికార్డును జోరిచ్ తాజాగా తన ఖాతాలో వేసుకున్నాడు. కాగా భారత్ తరఫున యూత్ వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఆటగాడిగా అంబటి రాయుడు కొనసాగుతున్నాడు. ఇంగ్లండ్‌తో 2002 నాటి మ్యాచ్‌లో రాయుడు 177 పరుగులు సాధించాడు. అతడి తర్వాతి స్థానాల్లో రాజ్ అంగద్ బవా (2022లో ఉగాండాపై 162), మయాంక్ అగర్వాల్ (160), శుబ్‌మన్ గిల్ (160), వైభవ్ సూర్యవంశీ (143) ఉన్నారు.

## తొలి ఓవర్లో రెండు వికెట్లు..

## కష్టాల్లో టీమిండియా!.. గంభీర్‌పై ఫ్యాన్స్ ఫైర్

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో.. రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన టీమిండియాకు ఆదిలోనే భారీ షాక్ తగిలింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్‌తో పాటు వన్‌డౌన్ బ్యాటర్ సాయి సుదర్శన్ కూడా డకౌట్ అయ్యాడు. ఇంగ్లండ్ బౌలింగ్ అటాక్ మొదలుపెట్టిన పేసర్ క్రిస్ వోక్స్ అద్భుతమైన డెలివరీలతో వీరిద్దరిని పెవిలియన్‌కు పంపాడు. తొలి ఓవర్లో నాలుగో బంతికి వోక్స్ సంధించిన బంతిని జైసూ షాట్ ఆడేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. బ్యాట్ ఎడ్జ్‌ను తాకిన బంతి గాల్లోకి లేవగా.. ఫస్ట్ స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న జో రూట్ చేతుల్లోకి వెళ్లింది. అయితే, క్యాచ్ పట్టడంలో తడబడిన రూట్.. ఎట్టకేలకు బంతిని జాగ్రత్తగా ఒడిసిపట్టాడు. దీంతో.. నాలుగు బంతులు ఎదుర్కొన్న జైస్వాల్... పరుగుల ఖాతా తెరవకుండానే వెనుదిరిగాడు. ఇక జైసూ స్థానంలో వచ్చిన సాయి సుదర్శన్‌ను మరుసటి బంతికే వోక్స్ పెవిలియన్‌కు పంపాడు. వోక్స్ వేసిన బంతిని వదిలేయాలని సాయి భావించగా.. బాల్ అతడు ఊహించిన దానికంటే కాస్త ఎక్కువగానే జంప్ అయింది. ఈ క్రమంలో బ్యాట్ బాటమ్ ఎడ్జ్‌ను



తాకిన బంతి.. సెకండ్ స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న హ్యారీ బ్రూక్ చేతుల్లో పడింది. దీంతో భారత్ తొలి ఓవర్లోనే రెండు కీలక వికెట్లు కోల్పోయింది. ఇక అంతకముందు 669 పరుగులకు ఆలౌట్ అయిన ఇంగ్లండ్.. భారత్ రెండో ఇన్నింగ్స్‌లో తొలి ఓవర్ ముగిసేసరికి 311 పరుగుల ఆధిక్యంలో కొనసాగడంతో పాటు.. రెండు వికెట్లు తీసి సత్తా చాటింది. వరుస బంతుల్లో వికెట్లు తీసిన వోక్స్... కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకునే ప్రయత్నం చేసి విఫలమయ్యాడు. దీంతో అతడు హ్యాట్రిక్ మిస్సవగా.. టీమిండియా ఊపిరి పీల్చుకుంది. ఈ క్రమంలో రెండో ఓవర్లో జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో మరో ఓపెనర్ కేఎల్ రాహుల్ సింగిల్, గిల్‌తో కలిసి సింగిల్ తీయడంతో ఎట్టకేలకు భారత్ పరుగుల ఖాతా తెరిచింది.

## తొలగిన అడ్డంకులు..

## సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్



ఈ ఏడాది జరగాల్సిన పురుషుల ఆసియా కప్ టోర్నీకి అన్ని అడ్డంకులు తొలగిపోయాయి. తటస్థ వేదికపై టోర్నీ నిర్వహణకు భారత క్రికెట్ నియంత్రణ మండలి ఆమోదం తెలపడంతో మెగా ఈవెంట్‌కు లైన్ క్లియర్ అయింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్ ఆరంభం కానుందని ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు మొహ్సిన్ నఖ్వీ వెల్లడించాడు. ఈ విషయాన్ని శనివారం ప్రకటన ద్వారా ఆయన అధికారికంగా ధ్రువీకరించాడు. టీ20 వరల్డ్ కప్ నేపథ్యంలో ఈ ఎడిషన్‌ను పొట్టి ఫార్మాట్‌లోనే జరపనున్న విషయం తెలిసిందే. 'యూఏఈ వేదికగా ఈ ఏడాది పురుషుల ఆసియా కప్ నిర్వహించనున్నామనే విషయాన్ని మీకు తెలియజేయడానికి సంతోషిస్తున్నా. ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ సెప్టెంబర్ 9 నుంచి 28వ తేదీ వరకూ జరుగుతుంది. లీగ్ దశ మ్యాచ్‌లు, నాకౌట్ మ్యాచ్‌ల తేదీలతో పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తాం' అని నఖ్వీ వెల్లడించాడు. షెడ్యూల్ ప్రకారం భారత్‌లో ఈసారి ఆసియా కప్ జరగాల్సింది. పాక్‌తో ఉద్రిక్తతల కారణంగా ఆతిథ్య హక్కులను వదులుకున్న బీసీసీఐ తటస్థ వేదికపై నిర్వహణకు తమకు అభ్యంతరం లేదని ఐసీసీకి, ఏసీసీకి తెలిపింది. దాంతో.. యూఏఈ గడ్డపై ఈ మెగా ఈవెంట్‌ను జరిపేందుకు ఏసీసీ సన్నాహకాలు ప్రారంభించింది. ఇంకా నెల రోజుల సమయమే ఉండడంతో.. షెడ్యూల్ ఖరారు చేయడంలో నిమగ్నమైంది ఏసీసీ.


**పసికూనలు తొలిసారి..**

ఆసియా వరల్డ్ కప్‌గా పేరొందిన ఈ టోర్నీలో ఎనిమిది జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ఆసియా క్రికెట్ మండలిలో సభ్య దేశాలైన భారత్, బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గనిస్థాన్, పాకిస్థాన్‌లు నేరుగా ఈ టోర్నీకి అర్హత సాధించాయి. పసికూనలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఒమన్, హాంకాంగ్ జట్లు తొలిసారి ఈ పోటీల బరిలో నిలిచాయి. గత ఎడిషన్‌లో లంకు షాకిచ్చి కప్‌ను ఎగరేసుకుపోయిన టీమిండియా డిఫెండింగ్ ఛాంపియన్‌గా అడుగు పెట్టనుంది.

# సినీ నిర్మాత, హీరోను చెప్పుతో కొట్టిన నటి



బాలీవుడ్ నటుడు, నిర్మాత మాన్ సింగ్‌ను నటి రుచి గుజ్జర్ చెప్పుతో కొట్టింది. 'సో లాంగ్ వ్యాలీ' అనే హిందీ చిత్రాన్ని మాన్ సింగ్ దర్శత్వం వహించడంతో పాటు ఆయనే నిర్మాతగా ఉన్నారు. ఆపై ఇదే చిత్రంలో కీలక పాత్రలో నటించారు. జులై 25న చిత్ర యూనిట్‌తో కలిసి ముంబైలోని సినీపోలిస్ థియేటర్‌కు మాన్ సింగ్ వచ్చారు. ఆ సమయంలో నటి రుచి గుజ్జర్ ఆవేశంతో తనకు చెల్లించాల్సిన డబ్బు ఇవ్వాలంటూ చెప్పుతో కొట్టింది. అందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. నిర్మాత, నటుడు మాన్ సింగ్ తనకు రూ. 25 లక్షలు బాకీ ఉన్నాడని రుచి గుజ్జర్ పేర్కొంది. ఆ డబ్బు ఇవ్వాలంటూ అతనిపై చెప్పుతో దాడి చేసింది. ఈ క్రమంలో చెప్పు దాడి నుంచి తప్పించుకునేందుకు ఆయన ప్రయత్నం చేయగా.. ఆమెను నిలువరించేందుకు చిత్ర సహ నిర్మాత కరణ్ అడ్డుపడ్డాడు. ఆ చిత్ర నిర్మాతలు గాడిదలపై కూర్చున్నట్లు చిత్రీకరించబడిని కొన్ని ప్లకార్డులను ఆమె ప్రదర్శించింది. అందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. చాలా కాలంగా తనకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా తనను ఇబ్బంది పెడుతున్నాడని మాన్ సింగ్‌పై పోలీసులకు రుచి గుజ్జర్ ఫిర్యాదు చేసింది. మ్యూజిక్ ఆల్బమ్‌లకు సంబంధించి తనకు రావాల్సిన రెమ్యునరేషన్ కోసం ఆమె ఇలా చేయాల్సి వచ్చినట్లు తెలుస్తోంది. నటి రుచి గుజ్జర్ ప్రధానంగా మోడలింగ్, మ్యూజిక్ వీడియోల ద్వారా బాలీవుడ్‌లో గుర్తింపు పొందింది. కొన్ని ప్రైవేట్ వీడియో సాంగ్స్‌లో నటించిన ఆమెకు పాపులారిటీ వచ్చింది. 2023 మిస్ హర్యానాగా నిలిచిన ఈ బ్యూటీ ఈ ఏడాది మే నెలలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో సందడి చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ ఫొటోతో కూడిన నెక్లెస్ ధరించి అందరినీ ఆకర్షించే ప్రయత్నం చేసింది.



# రిలీజ్‌కి ముందే రికార్డులు క్రియేట్ చేస్తున్న కింగ్‌డమ్.. 24 గంటలు కాకముందే

రౌడీ హీరో విజయ్ దేవరకొండని వరుస ఫ్లాపులు పలకరిస్తున్నా కూడా ఆయన క్రేజ్ తగ్గడం లేదు. విజయ్ దేవరకొండ సినిమా రిలీజ్ అవుతుంది అంటే ఫ్యాన్స్ ఆ సినిమా కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తూ ఉంటారు. తాజాగా విజయ్ హీరోగా 'కింగ్‌డమ్' అనే చిత్రం రూపొందింది.. ఈ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించగా.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ నిర్మించాడే. ఈ చిత్రం జూలై 31న ప్రపంచవ్యాప్తంగా తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో విడుదల కాబోతుంది. ఈ సందర్భంగా మూవీ ప్రమోషన్ కార్యక్రమాలని వేగవంతం చేసింది. ఇప్పటికే కింగ్‌డమ్ బాయ్స్ అంటూ దర్శకుడు గౌతమ్ తిన్ననూరితో పాటు విజయ్ దేవరకొండ, సందీప్ రెడ్డి వంగా కలిసి ఒక పాడ్ కాస్ట్‌ని విడుదల చేయగా, అది అందరిని అలరించింది. మరోవైపు నేడు తిరుపతిలో ట్రైలర్ లాంచ్ వేడుక ప్లాన్ చేశారు. ఇక ప్రీ రిలీజ్ వేడుకని హైదరాబాద్‌లో జూలై 28న నిర్వహించబోతున్నట్లు ప్రకటించింది. మేకర్స్ సినిమాపై మంచి హైప్ తెస్తున్నారు. జూలై 30న యుఎస్‌లో ప్రీమియర్ షోలు జరగనుండగా, బుకింగ్స్ ఓపెన్ చేసిన 24 గంటల్లోనే పదివేల టికెట్లు అమ్ముడయ్యాయి. ఈ విషయాన్ని చిత్రబృందమే అధికారికంగా ప్రకటిస్తూ ఓ స్పెషల్ పోస్టర్ కూడా విడుదల చేసింది. కింగ్‌డమ్ క్రేజ్ చూసి ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. హిందీలో 'సామ్రాజ్య' అనే టైటిల్‌తో ఈ చిత్రం విడుదల కానుంది. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు %ఖ/ూ% సర్టిఫికెట్ ఇచ్చింది. మూవీ చూసిన బోర్డు సభ్యులు "సినిమా అదిరిపోయిందంటూ" ప్రశంసలు కురిపించారట. విజయ్ దేవరకొండ %–% గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో వస్తున్న ఈ యాక్షన్ డ్రామా ఈ ఏడాది టాలీవుడ్‌లో మరో బ్లాక్‌బస్టర్‌గా నిలవబోతోందని అభిమానులు నమ్మకంగా ఎదురుచూస్తున్నారు. కాగా, విజయ్ గతంలో 'ఫ్యామిలీ మ్యాన్' తరహా పాత్రలు చేయగా, ఇప్పుడు కొంత గ్యాప్ తీసుకుని, మళ్లీ యాక్షన్ ఫుల్ అవతార్‌లో 'కింగ్‌డమ్' తో స్క్రీన్‌పై సందడి చేయబోతున్నాడు. 'మళ్ళీ రావా', 'జెర్సీ' లాంటి క్లాసిక్స్ రూపొందించిన గౌతమ్ తిన్ననూరి ఈ సినిమాను ఎవరు ఊహించని విధంగా యాక్షన్ ఎంటర్టైనర్ గా తీర్చిదిద్దారు.




# 'ఖైదీ 2' తర్వాత రజినీ సర్‌తో మరో సినిమా చేస్తాను : లోకేష్ కనగరాజ్

తమిళ స్టార్ దర్శకుడు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రాబోతున్న తాజా చిత్రం కూలీ. రజనీకాంత్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రంలో అగ్ర నటులైన నాగార్జున, ఆమిర్ ఖాన్, సత్యరాజ్, ఉపేంద్ర, షౌబిన్ షబీర్, శృతి హాసన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం ఆగష్టు 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వరుసగా ప్రమోషన్స్ చేస్తుంది చిత్రయూనిట్. అయితే ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న లోకేష్ తన అప్‌కమింగ్ ప్రాజెక్ట్‌ల గురించి స్పందించాడు. 'కూలీ' చిత్రాన్ని చూసిన తర్వాత రజనీకాంత్ సార్ తనతో కలిసి మరో సినిమా చేయాలని కోరారని లోకేష్ కనగరాజ్ తెలిపారు. అయితే, ఈ కొత్త ప్రాజెక్ట్ 'కూలీ 2' కాదని లోకేష్ స్పష్టం చేశారు. "కూలీ సినిమాకు సరైన ప్రారంభం మరియు ముగింపు ఉన్నాయి కాబట్టి, అది 'కూలీ 2' అయ్యే అవకాశం లేదు" అని ఆయన పేర్కొన్నారు. దీనిబట్టి, రజనీకాంత్, లోకేష్ కాంబినేషన్‌లో రాబోయే తదుపరి చిత్రం పూర్తిగా కొత్త కథాంశంతో ఉంటుందని తెలుస్తోంది. అయితే ఈ ప్రాజెక్ట్ ఖైదీ 2 తర్వాత ఉంటుందని లోకేష్ వెల్లడించాడు.



# వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్‌గా మారిన మాళవిక

మాళవిక గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మాళవిక మోహనన్ 7 ఆగస్టు 1992న ముంబైలో జన్మించింది. ఆమె తండ్రి యుకె మోహనన్ బాలీవుడ్ చిత్రాలకు ప్రసిద్ధ సినిమాటోగ్రాఫర్. తల్లి వీణా మోహనన్. ఆమె ప్రస్తుతం తన స్వస్థలమైన కేరళ బియ్యూర్‌లో తన కుటుంబంతో నివసిస్తుంది. మాళవిక మోహనన్ హీరోయిన్ గా రాణిస్తుంది. ఈ ముద్దుగుమ్మ 2013 సంవత్సరంలో "బట్టం బోలే" చిత్రంతో మలయాళ చిత్రసీమలోకి అడుగుపెట్టింది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా తెరకెక్కిన పెట్టా చిత్రంలో నటించి తమిళ అభిమానుల దృష్టిని ఆకర్షించిన నటి మాళవిక మోహనన్. ఆ తర్వాత నటుడు విజయ్ సరసన లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో మాస్టర్ సినిమాలో నటించి అభిమానుల గుండెల్లో స్థానం సంపాదించుకుంది. రీసెంట్ గా దర్శకుడు బి. రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ నటించిన "తంగళన్"లో మాళవిక మోహనన్ కీలక పాత్ర పోషించింది. మాళవిక ఈ సినిమాలో డిఫరెంట్ క్యారెక్టర్ చేసి మెప్పించింది. ఇక ఇప్పుడు ప్రభాస్ హీరోగా నటిస్తున్న రాజా సాబ్ సినిమాతో ఈ అమ్మడు టాలీవుడ్ కు పరిచయం కానుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఈ సినిమా తర్వాత టాలీవుడ్ లో ఈ బ్యూటీ రాణిస్తుందేమో చూడాలి. ఇక ఈ అమ్మడు సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటుంది. తాజాగా వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ ల మారింది. వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ అవతార్ లో సోషల్ మీడియాలో కొన్ని ఫోటోలను వదిలింది. ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోలకు నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.

# మిరాయ్ ఫస్ట్ సింగిల్ వచ్చేసింది.. వైబ్ ఉంది బేబీ




హనుమాన్ లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత తేజ సజ్జ నటిస్తున్న మరో పాన్ ఇండియా చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మంచు మనోజ్ విలన్‌గా నటిస్తున్నాడు. రితికా నాయక్ హీరోయిన్. సెప్టెంబర్ 5న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా 8 భాషల్లో రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ని విడుదల చేశారు మేకర్స్. 'వైబ్ ఉంది బేబీ' అంటూ సాగే ఈ పాటకు కృష్ణకాంత్ లిరిక్స్ అందించగా, అర్మాన్ మాలిక్ ఆలపించారు. తేజ సజ్జా అదిరిపోయే స్టెప్పులేసి ఆకట్టుకున్నాడు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,